PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 41 | విజయవాడ, ఆదివారం 10 సెప్టెంబర్ 2023 | 6+8 పేజీలు+స్నేహ వెల : 7. 00
Vol No | Vijayawada, Sunday 10 September 2023 | Rs

ఉన్నత విద్యకు ప్రమాదం
- యూనివర్సిటీల సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

• లోపలి పేజీలో.. •

టీమిండియాకు కఠిన పరీక్ష
- సూపర్-4లో నేడు పాకిస్తాన్‌తో కీలక పోరు
- పొంచివున్న వర్షం ముప్పు?

• లోపలి పేజీలో.. •

చంద్రబాబు అరెస్ట్

- నంద్యాలనుండి రోడ్డుమార్గంలో తరలింపు
- భగ్గుమన్న టిడిపి శ్రేణులు
- ఎక్కడికక్కడ అడ్డుకునే యత్నం.. దారిపొడవునా ఉద్రిక్తత
- రాష్ట్రవ్యాప్తంగా అరెస్ట్‌లు
- పలు జిల్లాల్లో ఆర్‌టిసి బస్సుల నిలిపివేత

బాబే లబ్ధిదారుడు

స్కిల్ డెవలప్‌మెంటు స్కామ్‌లో చంద్రబాబే ప్రధాన కుట్రదారుడు. ప్రధాన నిందితుడు, చివరి లబ్ధిదారుడు కూడా చంద్రబాబే! ఈవ్యవహారంలో 550 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని అంచనా వేస్తున్నాం. ఈ లావాదేవీలకు సంబంధించి అన్ని విషయాలు చంద్రబాబుకు తెలుసు. సాక్ష్యాధారాలు మా వద్ద ఉన్నాయి. అందుకే, న్యాయపరంగా అన్ని చర్యలు తీసుకుని అరెస్ట్ చేశా. లోకేష్ పాత్రపై కూడా విచారణ జరుపుతున్నాం.

సిఐడి అదనపు డిజి సంజయ్

రాజీ పడే ప్రసక్తే లేదు



'45 ఏళ్ల నా రాజకీయ జీవితం మీద మచ్చ వేయడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. కానీ, ఎవరివల్లా కాలేదు. ఎందుకంటే నిప్పులా బతికా. తెలుగు ప్రజల బాగు గురించి ఆలోచించడం తప్ప, నాకు మరో ధ్యాస ఉండదు. ప్రజల గురించి పోరాడుతున్నా కాబట్టే ఈ రోజు ఈ బెదిరింపులు... అక్రమ అరెస్టులు. ఇవి ఏవీ నన్ను నా ప్రజల నుండి వేరుచేయలేవు. ప్రభుత్వ అక్రమాలపై నా పోరాటాన్ని ఆపలేవు. అంతిమంగా గెలిచేది ప్రజాస్వామ్యమే...అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగమే. రాజీ పడే ప్రసక్తే లేదు.

అరెస్ట్ అనంతరం చంద్రబాబు

నేడు రాష్ట్ర వ్యాప్త నిరాహార దీక్షలకు టిడిపి పిలుపు

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు అరెస్ట్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అవినీతికి సంబంధించిన కేసులో శనివారం తెల్లవారు జామున నంద్యాలలో ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రోడ్డు మార్గంలో గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని సిఐడి కార్యాలయానికి తరలించారు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో సిఐడి కార్యాలయానికి చంద్రబాబును తీసుకురాగా, రాత్రి పొద్దుపోయేవరకు విచారణ ప్రక్రియ కొనసాగు తోంది. దీంతో ఆయన్ను కోర్టులో ఎప్పుడు హాజరు పరుస్తారన్న విషయమై గందరగోళం నెలకొంది. చంద్రబాబును వెంటనే కోర్టులో హాజరుపరచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రాత్రి ఒంటి గంటవరకు కూడా రిమాండ్ రిపోర్టు రాకపోవడంతో హౌస్‌మోహన్ పిటిషన్‌ను న్యాయమూర్తి ఆమోదించలేదని తెలిసింది. అరెస్టుకు నిరసనగా ఆదివారంనాడు సామూహిక నిరాహార దీక్షలకు టిడిపి పిలుపునిచ్చింది. శనివారమే రాష్ట్రపతికి, ప్రధానికి లేఖ రాసిన టిడిపి నేతలు ఆదివారం ఉదయం రాష్ట్ర గవర్నర్‌ను విశాఖలో కలిసి అరెస్ట్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్ళనున్నారు. అంతకుముందు బాబు అరెస్ట్ విషయంలో పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి నేతలను నిర్బంధించారు. అనంతరం బాబును అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియడంతో టిడిపి శ్రేణులు భగ్గుమన్నాయి. నంద్యాల- విజయవాడ హైవేలో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ బాబు తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. . పలుచోట్ల అడ్డుకుంటున్న వారిని అరెస్ట్ చేశారు. రెండు, మూడు చోట్ల లాఠీఛార్జీ చేశారు. టిడిపి శ్రేణులకు చంద్రబాబే సర్ధిచెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ టిడిపి శ్రేణులు అందోళనకు దిగాయి. దీంతో అనేకచోట్ల ఆర్‌టిసి బస్సులను నిలిపివేశారు.

నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేస్తున్న సిఐడి పోలీసులు

సిఐడి కార్యాలయంలో చంద్రబాబును భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, బాలకృష్ణ కలిశారు. శుక్రవారం అర్ధరాత్రి నుండే నంద్యాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాబును అరెస్ట్ చేయనున్నారన్న సమాచారం తెలియడంతో పెద్దసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన బసచేసిన ఆర్‌కె ఫంక్షన్ హాలువద్దకు చేరుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శనివారం తెల్లవారుజామున ఫంక్షన్ హాలు వద్దకు చేరుకున్న సిఐడి బృందం ఆయనకు సిఆర్‌పిసి సెక్షన్ 50(1) ప్రకారం నోటీసులు అందజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అవినీతికి సంబంధించి క్రైమ్ నంబర్ 29-2021 కింద నమోదైన కేసులో అరెస్ట్ చేస్తున్నట్లు దీనిలో పేర్కొన్నారు.

సిఆర్‌పిసి సెక్షన్ 50(1) ప్రకారం నోటీస్ ఇచ్చిన సిఐడి అధికారులు, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం (1988) ప్రకారం చంద్రబాబును అరెస్ట్ చేశారు. ఆయనపై ఐపిసి 120(బి), 166,167, 418,420,465,468,201,109 రెడ్‌విత్ 34,37 సెక్షన్‌ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. అవినీతినిరోధక చట్టం లోని సెక్షన్లు 12,13(2), రెడ్ విత్ 13(1) (సి)(డి) ప్రకారం కూడా కేసులు పెట్టారు.

పూర్తి వివరాలు లోపల పేజీలో

చిలకలూరిపేట వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి శ్రేణులు

- రాజకీయ దురుద్దేశం లేదు : హోం మంత్రి
- దర్యాప్తులో భాగంగానే అరెస్టు : సజ్జల రామకృష్ణారెడ్డి
- కక్ష సాధింపులో భాగమే : పవన్
- అరెస్టు హేయం : పురందేశ్వరి
- అమిత్‌షా మద్దతుతోనే అరెస్ట్ : నారాయణ

2

అరెస్టు తీరు తీవ్ర అభ్యంతరకరం : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడును నంద్యాలలో అరెస్టు చేసిన తీరు పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అర్ధరాత్రి చంద్రబాబు వసతిపై దాడిచేసి, జనాన్ని భయభ్రాంతులకు గురిచేసి తెల్లవారు జామున అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. చంద్ర బాబును తక్షణమే విడిచిపెట్టి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా విచారణ జరపాలని కోరారు. అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన టిడిపి కార్యకర్తలను రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్బంధం చేసి, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, చంద్రబాబు కుమారుడు లోకేష్‌ను అనుమతించకపోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఈ అరెస్టులను తమ పార్టీ ఖండిస్తుందని, అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

భూకంపం ధాటికి ముర్రాకేష్‌లో నేలమట్టమైన ఇళ్లు

మొరాకోలో భూ విలయం

- భూ కంప తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.8గా నమోదు
- వెయ్యి మందికి పైగా మృతి
- 1200 మందికి గాయాలు
- ఐరాస, జి20 దేశాధినేతల దిగ్భ్రాంతి

రాబట్ : ఉత్తరాఫ్రికా దేశమైన మొరాకోలో శుక్రవారం రాత్రి సంభవించిన పెను భూకంపంలో వెయ్యి మందికి పైగా మరణించారు. మరో 1200 మందికి పైగా గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. భూ కంపం ధాటికి పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. యునెస్కో చేత ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించబడిన ముర్రాకేష్‌లోని పాత బస్తీలోని కొన్ని భవనాలు పూర్తిగా దెబ్బతినిపోయాయి. భూకంపం తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.8 గా నమోదయింది. భూకంప నాభి యురేసియన్, ఆఫ్రికన్ ఫలకాల మధ్య 18.5 కి.మీ లోతున ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంప కేంద్రానికి సమీపంలోని మర్రాకేష్ ప్రాంతం ఎటు చూసిన శవాల గుట్టలతో మరుభూమిని తలపిస్తోంది.మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు, క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రాంతమంతటా హృదయవిదారకమైన పరిస్థితి నెలకొంది. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చునని అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గాయపడిన వారితో సమీప ఆస్పత్రులు కిక్కిరిసి పోయాయి. ఈ ప్రకంపనల ప్రభావం పొరుగున ఉన్న అల్జీరియాలోనూ కనిపించింది. అయితే, అక్కడ ఎలాంటి నష్టం సంభవించలేదు. 2004లో మొరాకోలోని ఉత్తర రిఫ్ పర్వతాల్లో సంభవించిన భూకంపంలో 600 మంది మరణించారు. ఆ తరువాత మొరాకోలో సంభవించిన అత్యంత ఘోర భూకంపమిదే. 1980లో అల్జీరియాలో 7.3 తీవ్రతతో తీవ్ర భూకంపం సంభవించింది. నాటి దుర్ఘటనలో 2, 500 మంది మరణించగా, మూడు లక్షల మంది నిరాశ్రయులుగా మారారు. ఈ ఏడాది తుర్కియే సైతం ప్రకృతి ప్రకోపానికి గురైన సంగతి తెలిసిందే.

మొరాకో భూ కంపంలో భారీగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం చోటుచేసుకోవడం పట్ల ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కష్టకాలంలో మొరాకో ప్రభుత్వానికి, దేశ ప్రజలకు అండగా నిలుస్తామని ఆయన ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన జి20 శిఖరాగ్ర సదస్సు కూడా మొరాకో భూకంపం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కష్ట కాలంలో ప్రపంచ దేశాలన్నీ మొరాకో ప్రజలతోనే ఉన్నాయని ఈ సదస్సు ప్రారంభానికి ముందు జి20కి ఆతిథ్యమిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మొరాకోకు సమష్టిగా సాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, రష్యా నేత పుతిన్ భూ కంప మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ విషాద సమయంలో మొరాకో ప్రజలకు అండగా వుంటామని తెలిపారు. మొరాకోకు అవసరమైన సాయాన్ని అందిస్తామని అమెరికా అధ్యక్షులు జో బైడెన్ తెలిపారు. మొరాకోలోని భారత జాతీయులెవరైనా అవసరమైతే ఫోన్ చేయాలంటూ భారత ఎంబసి కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్లను ఇచ్చింది.

కూలిపోయిన నివాసంలో ఎవరైనా ఉన్నారా అని గాలిస్తున్న రెస్క్యూ టీం

జి-20లో ఆఫ్రికన్ యూనియన్ చేరిక

- శిఖరాగ్ర సదస్సు నిర్ణయం
- ఉక్రెయిన్ యుద్ధంపై ఆచితూచి పద ప్రయోగం
- ఒక రోజు ముందే డిక్లరేషన్ విడుదల
- మదర్ ఆఫ్ డెమొక్రసీ గురించి మోడీ గొప్పలు

శాశ్వత సభ్యదేశాల హోదాలో కేటాయించిన కుర్చీలో ఆసీనులు కావాల్సిందిగా ఆఫ్రికన్ యూనియన్ చైర్ పర్సన్ అజలి అసామనిని ఆహ్వానిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : ఆఫ్రికన్ యూనియన్‌కు జి-20లో శాశ్వత సభ్యత్వం కల్పించాలని నిర్ణయించారు. శనివారం నాడిక్కడ అట్టహాసంగా ప్రారంభమైన జి- 20 శిఖరాగ్ర సదస్సు ఈ మేరకు ఒక డిక్లరేషన్‌ను ఆమోదించింది. సాధారణంగా సదస్సు ముగింపు రోజున డిక్లరేషన్ ఆమోదిస్తారు. కానీ, దీనికి భిన్నంగా ఒక రోజు ముందే డిక్లరేషన్‌ను ఆమోదించడం విశేషం. వర్ధమాన దేశాల కన్నా ధనిక దేశాల కూటమి ఎజెండాను ముందుకు తీసుకెళ్లే వేదికగా ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న జి-20 ఇక్కడ కూడా అదే రీతిన వ్యవహరించింది. రష్యా, చైనా అధ్యక్షులు హాజరుకాకపోవడానికి ఇది కూడా ఒక ముఖ్య కారణమని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో 'భారత మండపం'లో జరిగిన ఈ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభోపన్యాసం చేస్తూ, భారత దేశం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై అవకాశం దొరికినప్పుడల్లా ఆయన 'మదర్ ఆఫ్ డెమొక్రసీ' గురించి గొప్పగా మాట్లాడుతుంటారు. దేశంలో మైనార్టీలపై క్రూరమైన దాడులు, విద్వేషం వెళ్లగక్కడం వంటి ఆగడాలను సంఘ్‌పరివార్ మూకలు యథేచ్ఛగా సాగిస్తున్న అసహ్యకరమైన వాస్తవాన్ని ఈ వాగాడంబర పదజాలం మాటున కప్పిపుచ్చాలని చూస్తారు. మణిపూర్ మారణకాండ, నూహ్, గుర్గావ్‌లో మైనార్టీలపై దాడులు, ముజఫర్ నగర్‌లో ముస్లిం బాలుడ్ని తోటి విద్యార్థులతో కొట్టించిన టీచర్ ఉదంతం వంటి వాటిపై ఐరాస మానవ హక్కుల సంస్థ, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటివి అభ్యంతరాలు లేవనెత్తినా, జి-20 డిక్లరేషన్‌లో వాటి ప్రస్తావనే లేదు. మత విద్వేషాలను ఖండిస్తున్నామని, మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత సమావేశ హక్కు పరిరక్షణ గురించి కొందరు నేతలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ప్రపంచంలో చాలా మతాలకు భారత దేశం పుట్టినిల్లు, ఇక్కడ అన్ని మతాలు గౌరవించబడుతున్నాయి, మనది వసుధైక కుటుంబం అని అంటూ మోడీ మాటల గారడీ ప్రదర్శించారు. జి-20 డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం సాధించడం గొప్ప విజయంగా ఆయన మిగతా 5లో



జన విజ్ఞాన వేదిక రాష్ట మహాసభలో ప్రసంగిస్తున్న విఠపు బాలసుబ్రమణ్యం

విద్యార్థుల్లో చిన్నతనం నుంచే
శాస్త్రీయ భావాలు పెంపొందించాలి

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం
- చీరాలలో జెవివి రాష్ట్ర మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి- చీరాల (బాపట్ల జిల్లా)

విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ భావాలను పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. దీనికి విరుద్ధంగా పాలకులు అశాస్త్రీయ భావాలను పుంఖానుపుంఖాలుగా విద్యార్థుల మెదడుల్లో నింపుతున్నారని, జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో సైన్స్ విషయాలను కాకుండా సూడో సైన్స్‌ను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెండో రోజుల పాటు జరిగే జన విజ్ఞాన వేదిక (జెవివి) 17వ రాష్ట్ర మహాసభ శనివారం బాపట్ల జిల్లా చీరాలలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ పాఠ్యపుస్తకంలోని సిలబస్ నుంచి డార్విన్ జీవపరిణామ వాదాన్ని తొలగించడం ద్వారా భావి విద్యార్థులకు జీవ పరిణామ క్రమం తెలియకుండా సృష్టి వాదాన్ని నమ్మే విధంగా తయారు చేయాలనేది పాలకుల సంకల్పమని విమర్శించారు. విద్యాలయాల్లో హేతువిరుద్ధమైన వాస్తు జ్యోతిష్యం, భూత వైద్యం లాంటి మిగతా 5లో

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి
- అన్నదాతను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఆహార సంక్షోభం : వి శ్రీనివాసరావు

ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలను కొనసాగిద్దాం
- వర్ధంతి సభలో భాస్కరయ్య

మంచి విద్యతో మెరుగైన భవిష్యత్తు
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఘనంగా ఎయు స్నాతకోత్సవం

• లోపలి పేజీలో.. •

ఒంగోలులో చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న మహిళ

పోలీసు వాహనంలో చంద్రబాబు

బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం ముప్పవరంలో పోలీసుల లాఠీఛార్జి

- పదిగంటల జర్నీ, మూడు గంటలకుపైగా సిట్టింగ్
- వాట్సాప్ చాటింగ్‌పైనా వివరణ కోరిన అధికారులు
- బాబు ముందు 20 ప్రశ్నలు
- కార్యాలయానికి భువనేశ్వరి, లోకేష్

సిట్ సుదీర్ఘ విచారణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అరెస్టులో భాగంగా చంద్రబాబు నాయుడును సిట్ అధికారులు మూడు గంటలపాటు విచారించారు. వాట్సాప్ చాటింగ్ వివరాలను సిట్ అధికారులు ఆయన ముందుంచి ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆయన కోర్టులోనే తేల్చుకుంటానని సమాధానం ఇచ్చారు. శనివారం ఉదయం ఆరుగంటలకు నంద్యాలలో అరెస్టు చేసిన చంద్రబాబును రహదారి మార్గంలో తీసుకొచ్చి సాయంత్రం 5:10 గంటల సమయంలో కుంచనపల్లిలోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. చంద్రబాబు వస్తున్నారని తెలుసుకున్న తెలుగుదేశం కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. వారందరినీ నెట్టేసి పోలీసులు చంద్రబాబును సిట్ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అక్కడ లోపలకు తీసుకెళ్లే క్రమంలో ప్రభుత్వం తరపున ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి తదితర న్యాయవాదులు వచ్చారు. చంద్రబాబు తరపున న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. లోపలకు వెళ్లిన తరువాత తన తరపున ఐదుగురు న్యాయవాదులకు అనుమతినివ్వాలని కోరుతూ సిట్ అధికారులకు చంద్రబాబు లేఖ ఇచ్చారు. పరిశీలించిన అధికారులు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌తోపాటు మరొకరికి అనుమతినిచ్చారు. అనంతరం విచారణ మొదలుపెట్టారు. సిట్ తరపున ఇద్దరు అధికారులు విచారణలో పాల్గొన్నారు. సీమెన్స్ కుంభకోణానికి సంబంధించి 20 ప్రశ్నలను చంద్రబాబు ముందు ఉంచారు. అసలు ఈ కంపెనీతో ఒప్పందం ఎప్పుడు జరిగింది? క్యాబినెట్లో ఏమి నిర్ణయం తీసుకున్నారు? కంపెనీ వాటా ఇవ్వకుండా డబ్బులు ఎందుకు జమచేశారు? అవి ఎక్కడికి వెళ్లాయి? డొల్ల కంపెనీల్లో పెట్టుబడులు ఎవరు పెట్టారు? వాటి ఖాతాలు మీకు తెలుసా! వంటి అనేక ప్రశ్నలను చంద్రబాబు ముందు ఉంచారు. చంద్రబాబు పిఎ పెండ్యాల శ్రీనివాస్ ఇతరులు సీమెన్స్ తదితర కంపెనీలతో చేసిన వాట్సాప్ చాటింగ్ వివరాలనూ చంద్రబాబుకు చూపించారు. దీంతోపాటు అధికారుల నోట్ ఫైళ్లనూ చంద్రబాబు ముందు ఉంచినట్లు తెలిసింది.

విచారణ జరుపుతున్న మొత్తం వ్యవహారాన్ని వీడియో తీశారు. సుమారు 10 గంటల పాటు ప్రయాణం చేయించడంతోపాటు మూడున్నర గంటలపాటు ఆయనను సిట్ కార్యాలయంలోనే కూర్చోబెట్టారు. ఆదివారం ఉదయం ఆరుగంటల వరకూ వారికి సమయం ఉండటంతో ఆలోపు ఎప్పుడైనా జడ్జి ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాల్సి ఉండటంతో విజయవాడ ఆసత్రి ముందు భారీఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రబాబు కోసం ప్రత్యేక రూము సిద్ధం చేశారు. చంద్రబాబు తరపున కోర్టులో వాదనలు వినిపించేందుకు ప్రత్యేక విమానంలో వచ్చిన న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ఎసిబి కోర్టులో చంద్రబాబు కోసం ఎదురు చూస్తూ కూర్చుండిపోయారు. ప్రభుత్వం తరపున ఎఎజి వాదనలు వినిపించనున్నారు.

సిట్ ఆఫీసుకు చేరుకున్న లోకేష్, భువనేశ్వరి

చంద్రబాబును విచారిస్తున్న సిట్ కార్యాలయానికి ఆయన భార్య భువనేశ్వరి, తనయుడు లోకేష్ శనివారం సాయంత్రం ఎనిమిది గంటల సమయంలో చేరుకున్నారు. 10 గంటల పాటు సుదీర్ఘ ప్రయాణం చేయించి, ఇంకా విచారణ పేరుతో కూర్చోబెట్టడం ద్వారా ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని వారు విమర్శించారు. తొలుత న్యాయవాదిని అనుమతిస్తామని, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కల్పిస్తామని సిట్ అధికారులు తెలిపారు. విచారణ జరుగుతున్న భవనంలో ఐదో అంతస్తులో చంద్రబాబు ఉండగా, నాలుగో అంతస్తులో కుటుంబ సభ్యులు వేచి చూస్తున్నారు. కనీసం 24 గంటలు ఆయన్ను కస్టడీలో ఉంచుకోవాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందని టిడిపి నాయకులు విమర్శించారు. అలాగే భువనేశ్వరి సోదరుడు బాలకృష్ణ, ఆయన కుమార్తె బ్రహ్మణి ప్రత్యేక విమానంలో విజయవాడ చేరుకున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ

రాష్ట్ర శ్రేయస్సు కోసమే చంద్రబాబు పోరాటం

- నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, ఆమె సోదరుడు రామకృష్ణ శనివారం దర్శించుకున్నారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ.. చంద్రబాబుకు ప్రజల మద్దతు ఉందని తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సు కోసమే చంద్రబాబు పోరాటం చేస్తున్నారన్నారు. ఆయనకు మనోధైర్యం ఇవ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆమె చెప్పారు. నందమూరి రామకష్ణ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందనీ, రాత్రికి రాత్రి చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం చంద్రబాబు శ్రమిస్తున్నారని, రాష్ట్రాన్ని వదిలేసి ముఖ్యమంత్రి విదేశాలకు తిరుగుతున్నారని విమర్శించారు. అది మన దౌర్భాగ్యమన్నారు. టిడిపి నాయకులు కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశం లేదు : హోం మంత్రి

చంద్రబాబు నాయుడు అరెస్టులో ఎలాంటి రాజకీయ దురుద్దేశం, కుట్రలు లేవు. సిఐడి అధికారులు నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి చంద్రబాబును అరెస్ట్ చేసింది. నంద్యాల నుంచి విజయవాడకు హెలికాప్టర్‌లో తరలిస్తామని సిఐడి అధికారులు చెప్పినా చంద్రబాబు మాట వినలేదు. ఆయన ఎందుకు నిరాకరించారో అందరికీ అర్థం అవుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో జరిగిన స్కామ్‌ను గత ప్రభుత్వ పాలనలోనే గుర్తించారు. గతంలో జగన్‌ను రాజకీయ కుట్రతో అరెస్టు చేశారు. చంద్రబాబు అరెస్టు కేవలం ఆయన చేసిన తప్పిదాల వల్లే జరిగింది. అరెస్టును బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి ఏ విధంగా ఖండిస్తారో సమాధానం చెప్పాలి. ఆమె ఖండన ద్వారా అమిత్ షాపై రాళ్లు వేయించిన, మోడీని తిట్టించిన వారిని సమర్థిస్తున్నట్టు ఉంది. ఇన్నాళ్లు మాట్లాడని పవన్ కల్యాణ్ ఈ రోజు ముందుకురావడం ద్వారా ఈ స్కాంలో పవన్ కల్యాణ్ ప్యాకేజీ ఎంతో ప్రకటించాలి' అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు.

దర్యాప్తులో భాగంగానే అరెస్టు : సజ్జల రామకృష్ణారెడ్డి

చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ దర్యాప్తులో భాగంగానే అరెస్టు చేశారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కచ్చితమైన ఆధారాలు ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థ అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సాధారణమని పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూర్తి నిగ్రహం, సంయమనంతో ఎలాంటి దురుద్దేశాలు లేవన్నారు. బోగస్ సంస్థలను క్రియేట్ చేసి ప్రపంచంలో ఒక ప్రముఖ సంస్థ పేరు చెప్పి స్కామ్ చేశారని విమర్శించారు. ఈ పేరుతో ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఒక్క రాత్రిలో వచ్చింది కాదని, 2021 డిసెంబరు 9న ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. సిఐడి దర్యాప్తును కొనసాగిస్తూ చాలా మందిని విచారించిందని, అరెస్టులు కూడా చేసిందని తెలిపారు. 2017లోనే జిఎస్‌టి ఇంటెలిజెన్స్ స్కామ్‌ను బయటపెట్టిందన్నారు. ఎకనామిక్ అఫెన్స్‌లో నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 2017-18లో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందనేది తెలిసిందని, అన్నీ ఆధారాలున్నా దర్యాప్తులో తేలాలని, రాజకీయ ప్రమేయం ఉండకూడదని జగన్ అనుకున్నారని తెలిపారు. కాబట్టే రెండేళ్ల తరువాత అరెస్టు జరిగిందన్నారు. అర్ధరాత్రి అరెస్టు జరగలేదని, బాగా తెల్లవారిన తర్వాతే ఆయన్ను అరెస్టు చేశారని పేర్కొన్నారు.

చట్టం చంద్రబాబుకు చుట్టం కాదు : తమ్మినేని సీతారాం

చట్టం చంద్రబాబుకు చుట్టం కాదు. అందరికీ సమానమే. ఎక్కడైనా ఎవరైనా ప్రజాధనాన్ని లూటీ చేస్తే ఎంతటి వారికైనా అరెస్టులు తప్పవు. చంద్రబాబు నిప్పో, ఉప్పో, తుప్పో విచారణను ఎదుర్కొంటే తేలుతుంది. సిఐడి, జిఎస్‌టి వంటి సంస్థలు దర్యాప్తు చేయడంతో చంద్రబాబు నాయుడు బండారం బయటపడింది. సీమెన్స్ ఇండియా ప్రతినిధులను విచారించగా స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో తమకేమీ సంబంధం లేదని, తమ కంపెనీకి ఎటువంటి చెల్లింపులూ చేయలేదని వాంగ్మూలం ఇచ్చింది. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రి ఒత్తిడి మేరకు నిధులు విడుదల అని నోట్ ఫైల్ పెట్టారని శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు.

అమిత్‌షా మద్దతుతోనే అరెస్ట్ : నారాయణ

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మద్దతుతోనే ఈ అరెస్ట్ జరిగిందన్న విషయాన్ని చంద్రబాబు గ్రహించాలి. రివర్స్‌టెండరింగ్ ప్రవేశపెట్టిన జగన్, ఇప్పుడు రివర్స్ రివెంజ్ చేపడుతున్నారని తిరుపతిలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు.

అన్ని ఆధారాలతోనే : పెద్దిరెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అన్ని ఆధారాలతోనే చంద్రబాబును సిఐడి అరెస్టు చేసి, రోడ్డు మార్గంలో విజయవాడకు తరలించింది. 90శాతం సీమెన్స్, 10 శాతం ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉండగా రూ. 3,356 కోట్ల ప్రాజెక్టులో రూ.371 కోట్లు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం తరపున రూ.మూడువేల కోట్లు ఎందుకు ఖర్చు చేశారు. సీమెన్స్, డిజిటెక్, స్కిల్లర్ కంపెనీల ప్రతినిధులను ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ చేశారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలో మాట్లాడారు

కక్ష సాధింపులో భాగమే : పవన్

రాజకీయ కక్షసాధింపులో భాగమే చంద్రబాబు అరెస్టు అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ విమర్శించారు. ప్రాథమిక ఆధారాలు కూడా చూపించకుండా అర్ధరాత్రి అరెస్టు చేసే విధానాన్ని రాష్ట్రంలో అవలంబిస్తున్నారని, చంద్రబాబు అరెస్టును సంపూర్ణంగా ఖండిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షాలను అణచివేయాలనే వైసిపి విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు.

అరెస్టు హేయం : పురందేశ్వరి

చంద్రబాబు అరెస్టు హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. సరైన నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేయడం సరికాదని అన్నారు.

మొదటి అవినీతి పరులు జగన్, పెద్దిరెడ్డి : రామచంద్ర యాదవ్

ఈ రాష్ట్రంలో అత్యంత అవినీతిపరులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలేనని, అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలంటే ఆంధ్రప్రదేశ్ సిఐడి మొదట వారిద్దరిని అరెస్టు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపులకు వ్యవస్థలను, అధికారులను వాడుకోవడం బిసివై పార్టీ ఖండిస్తుందన్నారు.

రాజకీయ కక్ష సాధింపే : నాదెండ్ల మనోహర్

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే టిడిపి అధినేత చంద్రబాబును అరెస్టు చేశారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో చంద్రబాబు అరెస్టుపై ఆయన స్పందిస్తూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం వైసిపి ప్రభుత్వ కక్షపూరిత వ్యవహార శైలికి పరాకాష్టగా నిలుస్తోందని అన్నారు. చట్టపరమైన విధానాలకు వ్యతిరేకంగా పోలీసులు ప్రవర్తించడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లకుండా కావాలనే ప్రభుత్వం బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన, ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలపై ఆదివారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్ అధ్యక్షతన పార్టీ పిఎసి సభ్యులు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు.

గవర్నరుకు ఆలస్యంగా సమాచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంపై గవర్నరుకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. 2018లో చేసిన చట్ట సవరణ ప్రకారం మాజీ ప్రజా ప్రతినిధులను, ప్రజా ప్రతినిధులను అవినీతి నిరోధక చట్టం కింద అరెస్టు చేయాలంటే గవర్నరుకు సమాచారం ఇవ్వాల్సి ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. 2021లో చంద్రబాబు మీద కేసు నమోదు చేసిన సమయంలో గవర్నరుకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. శనివారం ఉదయం అరెస్టు చేసే ముందు కూడా గవర్నరు కార్యాలయానికి తెలపలేదని తెలుగుదేశం పార్టీ తరపు న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం అవుతుందని, దీనిపై ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. శనివారం సాయంత్రం విశాఖలో గవర్నరు మహ్మద్ అబ్దుల్ నజీర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నప్పటికీ నాయకులు హౌస్ అరెస్టులో ఉండటంతో కలవలేకపోయారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కలిసేందుకు మరోసారి అనుమతి కోరారు. చంద్రబాబు అరెస్టు విషయంపై గవర్నరుకు వివరించనున్నారు. అలాగే మాజీ సిఎం అని కూడా చూడకుండా పదిగంటలు ప్రయాణం చేయించారని, కనీస విశ్రాంతికి అవకాశం ఇవ్వలేదని, విచారణ పేరుతో నాలుగు గంటలు కూర్చోబెట్టారని గవర్నరుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

అక్రమ కేసులతో అరెస్టు

- టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజకీయ కక్షలో భాగంగానే తమ పార్టీ అధినేతను అరెస్టు చేశారని టిడిపి నేతలు విమర్శించారు. గిట్టని వాళ్లను జైళ్లకు పంపాలన్న జగన్ కోరికలో భాగమే అక్రమ అరెస్టు అని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విడివిడిగా విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. సిబిసిఐడి, సిఐడి వంటి విచారణ సంస్థలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తున్నాయని విమర్శించారు. సీమెన్స్ సంస్థను జగన్ ప్రభుత్వం భయపెట్టి తప్పుడు అఫిడవిట్ తీసుకొచ్చిందనేది పచ్చినిజమన్నారు. ఇడి విచారణలో కూడా ఎలాంటి నిధుల దుర్వినియోగం లేదని స్పష్టమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల నుంచి స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు బిఇఎల్, టాటా సంస్థల నుంచి వచ్చిన డబ్బును అవినీతి సొమ్ముగా చూపడాన్ని హైకోర్టు కూడా తప్పుపట్టిందన్నారు. అర్ధరాత్రి అరెస్టు పేరుతో హంగామా చేయాల్సిన అవసరం ఏమిటో జగన్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువగళంతో లోకేష్, ప్రజాబలంతో చంద్రబాబు ప్రభుత్వ పునాదులు కదుపుతున్నారన్న భయంతోనే జగన్ బరితెగించారని వ్యాఖ్యానించారు. చంద్రబాబును అరెస్టు చేయించి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ విమర్శించారు.

మంచోడు జైలుకు : లోకేష్

పిచ్చోడు లండన్‌కు, మంచోడు జైలుకు అని, ఇది కదా రాజారెడ్డి రాజ్యాంగం అని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేదని, ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలియదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలి ప్రతిపక్షనేతలపై కక్షసాధింపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్పడుతున్నారని టిడిపి ఎమ్మెల్సీ నందమూరి బాలకృష్ణ విమర్శించారు. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన తమ నాయకుడి పోరాటం ఆగదని టిడిపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందమూరి సుహాసిని అన్నారు.

ప్రభుత్వానికి రూ.300 కోట్ల నష్టం

- డొల్ల కంపెనీలకు నిధుల మళ్లింపు
- ప్రధాన నిందితుడు చంద్రబాబు
- సిఐడి అదనపు డిజి సంజయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అని సిఐడి అదనపు డిజి సంజయ్ అన్నారు. రూ.550 కోట్లకు సంబంధించిన లావాదేవీల్లో రూ.300 కోట్ల వరకు అవినీతి జరిగిందని తెలిపారు. నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా డొల్ల కంపెనీకి నిధులు మళ్లించారని, చంద్రబాబుకు అన్ని లావాదేవీల గురించి తెలుసు అని చెప్పారు. ఈ నిధుల దారి మళ్లింపునకు సంబంధించి ఆయన్ను ప్రశ్నించాల్సి ఉందని, న్యాయపరంగా అన్ని చర్యలూ తీసుకుని శనివారం నంద్యాలలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ఉదయం 6 గంటలకు తమ అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు. నంద్యాల నుంచి హెలికాప్టర్‌లో విజయవాడకు తరలించేందుకు ఆయన నిరాకరించారని పేర్కొన్నారు. సిఐడి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 జులై 14న ఉన్నత విద్యాశాఖ సీమెన్స్ కంపెనీ మధ్య ఎంఒయు జరిగిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.3,300 కోట్లు అని తెలిపారు. ఎంఒయును ఆచరణలో తీసుకొచ్చేందుకు సెప్టెంబరు 10న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను గత ప్రభుత్వం మంత్రివర్గ మండలి ఆమోదం లేకుండా ఏర్పాటు చేసిందన్నారు. దీనికి సిఇఒగా గంటా సుబ్బారావును నియమించారని పేర్కొన్నారు. సీమెన్స్ కంపెనీ నుంచి రూ.2,500 కోట్ల పెట్టుబడి రాబోతుందని, దీనికోసం ప్రభుత్వం నుంచి రూ.371 కోట్లు విడుదల చేయాల్సి ఉంటుందని చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో 2015 మార్చి 11న వెల్లడించారని వివరించారు. ఈ నగదు విడుదల చేయకూడదని ఆర్థిక శాఖ అధికారులు నోట్ రాసిన ప్రత్యేకమైన పరిస్థితుల్లో జిఓల ద్వారా డిజైన్‌టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఈ కంపెనీ నుంచి పివిఎస్‌పి, ఎసిఐ(షెల్), నాలెడ్జ్ పొడియ, ఇటిఎ, ప్యాట్రిక్, ఐటి స్మిత్, భారతీయ గ్లోబల్, ఇన్‌వెబ్, పోలరీస్, కడెన్స్ పార్టనర్, సింగపూర్ వంటి డొల్ల కంపెనీలకు నగదు తరలించారని వివరించారు.

చంద్రబాబు, లోకేష్ ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ ఖాతాల్లోకి మళ్లించారని, తరువాత పార్టీ ఖాతాల్లోకి మళ్లించారని వివరించారు. 90 శాతం పెట్టుబడి చూపించేందుకు స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో రూ.546 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్లను రాష్ట్రంలో ఆరు చోట్ల ప్రారంభించాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఇందులో రూ.58 కోట్లు ప్రభుత్వ వాటాగా చూపించారని తెలిపారు. సీమెన్స్ కంపెనీకి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసేందుకు డిజైన్ టెక్ కంపెనీ రూ.58 కోట్లు వెచ్చించిందని చెప్పారు. ఈ సాఫ్ట్‌వేర్ కొనుగోళ్లకు వెచ్చించిన నగదును రూ.3,330 కోట్లుగా చూపించారని తెలిపారు. ప్రధాన కుట్ర ఇదేనని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సీమెన్స్‌కు ఒప్పందం కుదిర్చిన డిజైన్‌టెక్ డెవలప్‌మెంట్ సీనియర్ అధికారి జివిఎస్ భాస్కర్ అని, ఆయన భార్య అపర్ణ ఐఎఎస్ డిప్యూటీ సిఇఒగా 2015లో ఉన్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తులైన డిజైన్‌టెక్‌కు చెందిన మనోజ్‌వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు మాజీ కార్యదర్శి శ్రీనివాసరావు విదేశాలకు పారిపోయారని తెలిపారు. తమ టీం యుఎస్, యుఎఇకి వెళ్లి వారిని తీసుకొస్తామన్నారు. చంద్రబాబుతో పాటు మనోజ్, శ్రీనివాసరావును విచారిస్తామన్నారు. నారా లోకేష్, ఆయన సన్నిహితుడు కిలారు రాజేష్ పాత్రలపై కూడా విచారణ జరుపుతామని తెలిపారు. నగదు బదిలీలను విచారణ జరిపేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు అదుపులోకి తీసుకున్న వారిపై విచారణ జరిపిస్తామన్నారు. లోకేష్ పాత్ర స్కిల్ డెవలప్‌మెంట్‌కే పరిమితం కాదని, ఎపి ఫైబర్ నెట్ కార్పొరేషన్, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు డైవర్షన్ కేసులు కూడా విచారణ జరుగుతుందన్నారు. వీటిల్లో కూడా లోకేష్ పాత్ర ఉందన్నారు.

బాబు అరెస్టు ఇలా...

ప్రజాశక్తి- యంత్రాంగం

నంద్యాల జిల్లా పర్యటనలో ఉన్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన ఆర్థిక కుంభకోణం కేసులో శనివారం ఉదయం సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. రోడ్డు మార్గంలో విజయవాడలోని ఎసిబి కోర్టుకు తరలించారు. చంద్రబాబును తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకోవడానికి మార్గమధ్యంలో టిడిపి శ్రేణులు ప్రయత్నించాయి. వారిని పోలీసులు నిలువరించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల పలుమార్లు లాఠీఛార్జి చేశారు. చంద్రబాబును అరెస్టు చేస్తారంటూ శుక్రవారం రాత్రి నుంచి ప్రచారం జరగడంతో నంద్యాల, కర్నూలు జిల్లాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయన బస చేసిన నంద్యాల ఆర్‌కె ఫంక్షన్ హాలుకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. తెల్లవారుజామున 3.30 గంటలకు సిట్ సిఐడి అధికారి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, సిఐలు రవీంద్ర, నరసింహులు, దస్తగిరిబాబు ఆధ్వర్యాన దాదాపు 300మందికి పైగా పోలీసులు మోహరించారు. చంద్రబాబు బస చేసిన ఫంక్షన్ హాలు వద్దకు వారు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా హై టెన్షన్ నెలకొంది. ఏం జరగబోతుందోననే ఉద్రిక్తత నెలకొంది. వాహనాలను అడ్డంగా ఉంచి ఎన్ఎస్‌జి పోలీసులను చంద్రబాబు బస చేస్తున్న ప్రాంతానికి రాయనీకుండా టిటిపి శ్రేణులు అడ్డుకున్నాయి. రాత్రిపూట అరెస్టు చేసేందుకు నిబంధనలు ఒప్పుకోబోవని చంద్రబాబు భద్రత సిబ్బందీ చెప్పారు. ఉదయం ఆరు గంటల వరకు పోలీసులు అక్కడే గది బయట వేచి ఉన్నారు. ఉదయం ఆరు గంటల తర్వాత చంద్రబాబునాయుడు కాలకృత్యాలు తీర్చుకుని బయటకొచ్చారు. సిట్ సిఐడి అధికారి రఘురామిరెడ్డి ఆయనకు అరెస్టు వారెంట్ చూపించారు. 'నేనొక మాజీ ముఖ్యమంత్రిని. అరెస్టు వారెంట్ ఏ నిబంధన కింద చూపుతారు. ఎఫ్ఐఆర్‌లో నా పేరు లేదు. నేనెక్కడికైనా పారిపోయేవాడినా? అందరి సమక్షంలో తిరుగుతున్న వాడిని' అంటూ చంద్రబాబు వాదించారు. దీనిపై రఘురామిరెడ్డి స్పందిస్తూ, మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలనేది మా ఉద్దేశం కాదని, మా డ్యూటీ మేము చేస్తున్నామని బదులిచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ... 'రాజ్యాంగం మీకేమైనా ప్రత్యేకంగా అధికారాలు కల్పించిందా? మాజీ ముఖ్యమంత్రిని అయిన నాకు ఇచ్చే గౌరవమిదేనా? ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలి కదా? సాక్ష్యాధారాలు ఏమున్నాయి? ప్రొసీజర్ నాకు కావాలి. నాకు కాన్ఫిడెన్స్ ఉండాలి. నేను సిటిజన్ కదా... నాకు రైట్స్ లేవా? డెమోక్రసీలోనే ఉన్నామా? వీటికి సమాధానం చెప్పకుండా ఎలా నన్ను అరెస్టు చేసి తీసుకెళ్తారు' అని ప్రశ్నించారు. 'దేనికి రమ్మంటున్నారు? రిమాండు ఎందుకు? మీది ప్రాసెస్ కాదు. నిబంధనలు ఏమయ్యాయి' అని వాదించారు. ప్రొసీడింగ్స్ ఫాలో కావడం లేదని, సెక్షన్స్ రిమాండ్‌కు పంపాక చూపుతామని పోలీసులు చెప్పడం అన్యాయమని అన్నారు. సీనియర్ అధికారికి నిబంధనలు తెలియవా? అని ప్రశ్నించారు. దాదాపు 40 నిమిషాల పాటు వాగ్వాదం కొనసాగింది. ఆ సమయంలో టిడిపి మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, చంద్రబాబు తరుపు న్యాయవాదులు అక్కడే ఉన్నారు. ఎట్టకేలకు చంద్రబాబుతో సిఐడి అధికారులు అరెస్టు వారెంటుపై సంతకం పెట్టించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఉదయం 6.45 గంటలకు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులకు, పోలీసులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. తమ అధినేతను ఎలా అరెస్టు చేస్తారంటూ టిడిపి శ్రేణులు ప్రశ్నించాయి. ఆ తర్వాత పోలీసుల హెచ్చరికలతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏ వాహనంలో తీసుకెళ్లాలని కొద్దిసేపు పోలీసులు చర్చించుకున్నారు. చివరకు పోలీస్ వాహనంలోనే విజయవాడకు చంద్రబాబును తరలించారు.

నిరసన తెలుపుతున్న లోకేష్
(ఇన్‌సెట్‌లో లోకేష్ ప్రదర్శిస్తున్న ప్లకార్డు)

పొదలాడలో లోకేష్ నిర్బంధం

- అనంతరం విడుదల, విజయవాడకు పయనం

ప్రజాశక్తి- రాజోలు (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిరసనకు దిగారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తున్నారనే సమాచారంతో రాజోలు మండలం పొదలాడలో ఉన్న లోకేశ్ విజయవాడ బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో, ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాజోలు సిఐ గోవిందరాజుతో లోకేశ్ వాగ్వాదానికి దిగారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. తన వెంట నాయకులు ఎవరూ రావడం లేదని, కుటుంబ సభ్యునిగా తాను ఒక్కడినే వెళ్తుంటే అడ్డుకునే హక్కు ఎవరిచ్చారని పోలీసులను నిలదీశారు. 'మీ ఇంట్లో ఎవరినైనా అరెస్టు చెస్తే మీరు వెళ్లరా? అని వారితో వాగ్వాదానికి దిగారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా లోకేష్ ఒక చేతిలో జాతీయ జెండాను, మరో చేతిలో 'తండ్రిని చూసేందుకు కొడుక్కి పోలీసుల అనుమతి కావాలా? అని రాసి ఉన్న ప్లకార్డును పట్టుకుని క్యాంప్ సైట్ వద్ద తన బస్సు వద్దే బైఠాయించి నిరసన తెలిపారు. లోకేష్ క్యాంప్ సైటులోకి నీరు, ఆహార పదార్థాలు రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. లోకేష్ ఆందోళన నేపథ్యంలో ఆయనను పోలీసులు ఆ తర్వాత విడిచిపెట్టారు. దీంతో, విజయవాడకు లోకేష్ పయనమయ్యారు. లోకేష్‌ను అడ్డుకున్నట్టు తెలుసుకున్న టిడిపి శ్రేణులు క్యాంపు సైట్ వద్దకు బయలు దేరాయి. వారిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో, కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మీడియాను కూడా లోకేశ్ బస చేసిన ప్రదేశానికి రానీయకుండా పోలీసులు ఆంక్షలు విధించారు.

చంద్రబాబు అరెస్టుపై జోక్యం చేసుకోండి

- రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రికి టిడిపి ఎంపిల లేఖ

ప్రజాశక్తి - విజయవాడ/శ్రీకాకుళం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రులకు ఎంపిలు కేశినేని నాని, కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం వేర్వేరుగా లేఖలు రాశారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా, ఎటువంటి ఆధారాలు చూపకుండా చంద్రబాబును ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఈ కేసులో రాజకీయ కక్షసాధింపు మినహా, ఏ విధమైన వాస్తవం లేదన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పాతరేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఈ అంశంలో వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, పౌర హక్కులను పరిరక్షించాలని కోరారు. రాజకీయ ప్రేరేపితమైన అంశాలతో సరైన ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేశారని లేఖలో పేర్కొన్నారు. 45 ఏళ్ల నిస్వార్థ ప్రజా సేవ చేసి నీతీ నిజాయితీలకు మారుపేరుగా ఉన్న చంద్రబాబుపై ఈ విధమైన పైశాచిక చర్యలను పార్టీలకు అతీతంగా ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. తన తండ్రిని కలవటానికి కూడా వెళ్లకుండా నారా లోకేష్‌ను అడ్డుకునే హక్కు పోలీసులకు ఏ రాజ్యాంగం కల్పించిందని ప్రశ్నించారు. ప్రజలు, టిడిపి శ్రేణులు చంద్రబాబుకు అండగా నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుటాంమని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం దారుణం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోడీ సర్కారు కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 940వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్, సిఎంఇ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ రాజకీయ పరిష్కారం ద్వారానే సాధ్యమని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలూ చిత్తశుద్ధితో కృషి చేస్తే ప్లాంట్‌ను కాపాడుకోగలమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఆ విషయాన్ని మరిచి బిజెపి పాలకులు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను దేశ ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునేందుకు ప్రతి తెలుగోడూ ముందుకు రావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ స్పందన సరిగా లేదన్నారు. ప్రజల ఆకాంక్షను గాలికొదిలేస్తే ఆ ప్రభుత్వం కూలిపోక తప్పదని హెచ్చరించారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్ కుమార్, జె.రామకృష్ణ, కారు రమణ, డి.శ్రీనివాస్, జి.నరేంద్ర, వరసాల బాలకృష్ణ, మధు, ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్‌లో ప్రీ-ఫెస్టివ్ ఆఫర్లు

బెంగళూరు : ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారుల కోసం అమెజాన్ ఫ్యాషన్‌లో ప్రీ-ఫెస్టివ్ ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఆకర్షణీయంగా ఉండేందుకు కుర్తాలు, కుర్తా సెట్లు, చొక్కాలు, చీరలు, లెహంగాలు, మేకప్, స్కిన్ కేర్ మొదలైనవాటిని ఎంచుకోవచ్చని పేర్కొంది. ఫ్యాషన్ ఔత్సాహికులు తమ పండుగకు ముందు సన్నాహాలను మరింత పెంచుకోవచ్చని తెలిపింది. ఇందుకోసం అమెజాన్‌ఫ్యాషన్ 'ది ఎత్నిక్ వీక్' యొక్క మూడవ ఎడిషన్‌ను సెప్టెంబర్ 8 నుండి 12 వరకు నిర్వహిస్తోన్నట్లు వెల్లడించింది. పలు బ్రాండ్లపై 80 శాతం వరకు డిస్కౌంట్‌ను కల్పిస్తోన్నట్లు పేర్కొంది.

ఉన్నత విద్యకు ప్రమాదం

యూనివర్సిటీల సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి)

జాతీయ నూతన విద్యా విధానంతో యూనివర్సిటీలలో ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, ఉన్నత విద్యకు ప్రమాదం ఏర్పడిందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. వైసిపి రాజకీయ కేంద్రాలుగా రాష్ట్రంలో యూనివర్సిటీలను మార్చడం సిగ్గుచేటన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వ విద్యాలయాల విద్యార్థుల కన్వెన్షన్ తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు పాల్గొని ప్రసంగించారు. ఉన్నత విద్య నేడు ప్రమాదంలో ఉందని, ప్రాథమిక విద్యలో చేరిన వారు ఉన్నత విద్యకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా పడిపోతుందన్నారు. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం యూనివర్సిటీల స్వతంత్రతను దెబ్బతీసేలా ఉందని తెలిపారు. యుజిసిని రద్దు చేస్తూ వర్సిటీల అభివృద్ధికి నిధుల కోత విధిస్తూ, స్వయం ప్రతిపత్తిని కోల్పోయేలా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీలకు నిధులు కేటాయించకుండా వాటి అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో 16 యూనివర్సిటీలకు గాను 3,450 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి, హేతుబద్ధీకరణ పేరుతో 845

రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పోస్టులు కుదించి, చివరకు 2,635 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారని తెలిపారు. వెంటనే పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. యూనివర్సిటీల అభివృద్ధికి ఎనలేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఎస్ఎఫ్ఐకు ఉందన్నారు. ఈ వారసత్వాన్ని కొనసాగించాలని కోరారు. వర్సిటీల్లో ప్రజాస్వామ్య హక్కులు హరిస్తోన్న నేపథ్యంలో ప్రశ్నించే గొంతులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్‌వి యూనివర్సిటీ విసి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, సహాయ కార్యదర్శి కిరణ్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు నాయక్, రవి, అన్విడ్, హరిత, ఆనంది, రాష్ట్రంలోని యునివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును ప్రారంభిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

బైజూస్ ట్యాబ్‌లు వినియోగించాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌లు వినియోగించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ కోరారు. నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన విద్యా సదస్సు శనివారంతో ముగిసింది. మొదట టోఫెల్ పరీక్షకు సంబంధించిన విషయాలను ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. బైజూస్‌లో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా, విద్యాబోధనకు సంబంధించిన పూర్తి విషయాలను రూపొందించినట్లు తెలిపారు. ప్రతీ ఛాప్టర్‌లో ఎన్నో స్థాయిలలో ప్రశ్నలు అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు అన్నింటినీ ప్రయత్నించాలని సూచించారు. అనంతరం బైజూస్ కంటెంట్, డిజిటల్ తరగతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రవీణ్ ప్రకాష్ సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక విద్యా బోధనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు వారి జీవితంలో ఉన్నత స్థానాలకు అధిరోహించేందుకు దోహదపడే అంశాలను వివరించారు.

క్లాప్ డ్రైవర్లకు బకాయి జీతాలు చెల్లించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ మున్సిపాల్టీల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నియామకమైన క్లాప్ డ్రైవర్లకు మూడు నుంచి ఐదు నెలల జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. క్లాప్ డ్రైవర్ల విస్తృతస్థాయి సమావేశం విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,500 మంది క్లాప్ డ్రైవర్లు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంలో సేవలందిస్తున్నారన్నారు. వీరి నియామకాల సందర్భంగా నెలకు రూ.15 వేల జీతం ఇస్తామని కాంట్రాక్టర్లు చెప్పారని, ఇప్పుడు రూ.9 వేల నుంచి రూ.13 వేలలోపు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, క్లాప్ మిత్ర వాహనాల కాంట్రాక్టర్ల మధ్య జరిగిన ఒప్పందంలో క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధంగా జీతభత్యాలు, సెలవులు అమలు చేస్తామని అంగీకరించినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. క్లాప్ మిత్ర వాహనాలకు రిపేర్లు వచ్చినా కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. వాహనాలు మరమ్మతులకు గురవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రమాదాలకు క్లాప్ డ్రైవర్లను బాధ్యులను చేసి రూ.లక్షల్లో జరిమానాలు వేస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి క్లాప్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నందు పెద్దయ్య, నాయకులు తేజేశ్వరరావు, రాజు, అజయ్‌కుమారు, గణేష్ మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దళితుల సమస్యలపై డిసెంబర్ 4న చలో పార్లమెంట్

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

దళితుల సమస్యలు పరిష్కరించాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరుతూ డిసెంబర్ 4న నిర్వహించే చలో పార్లమెంటును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కోరారు. 'దళితుల సమస్యలు- పరిష్కారం' అంశంపై గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వ ఓటమి లక్ష్యంగా దళితులు, బహుజనులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ దళితులకు రిజర్వేషన్లు లేకుండా చేస్తోందని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోందని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా కుల వివక్ష ఇంకా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తున్న బిజెపిని ఓడిస్తేనే లౌకికవాదాన్ని కాపాడుకోగలమని తెలిపారు. అఖిలభారత క్రాంతి రైతు సంఘం నాయకులు మనవ హరిప్రసాద్ మాట్లాడుతూ అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 12న దళితుల సమస్యలపై విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును, సెప్టెంబర్ చివరి వారంలో జరిగే ఆందోళనలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏరువాక రైతు సంఘం, అఖిల భారత రైతుల కూలీ సంఘం, రైతు, కౌలురైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం : సిఎస్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

జిల్లాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో పాడేరులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గానూ, రంపచోడవరం, భద్రాచలం ఐటిడిఎల పిఒగానూ తాను సేవలందించడం వల్ల చింతూరు, కూనవరం, విఆర్.పురం వంటి ప్రాంతాలపైనా అవగాహన ఉందన్నారు. మాతా శిశు మరణాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులు, తాగునీరు, విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏజెన్సీలోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి వంటి అధికారులు ప్రజలకు అందుబాటులోకి వచ్చారన్నారు. పార్వతీపురం, సీతంపేట ప్రాంతాల కంటే అల్లూరి సీతారామరాజు జిల్లాలో సేవలందించడం కాసింత ఇబ్బందికరమని చెప్పారు. ఏజెన్సీలో తాగునీటి సదుపాయానికి, రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. తమ జిల్లాల్లో అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

అన్నదాతను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఆహార సంక్షోభం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అమలాపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రాష్ట్రంలోని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని, రైతు భరోసా అందజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా అంటే కొంతమందికి ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదన్నారు. రైతు అంటే అన్నదాత అని, వారిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో అన్నపూర్ణ లాంటి మన రాష్ట్రంలో ఆహార సంక్షోభం తలెత్తే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. రాష్ట్రంలో వేల ఎకరాల దేవాదాయ భూముల్లో కౌలుకు సాగు చేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతుల చట్టాన్ని నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ లక్ష్యమా? అని ప్రశ్నించారు. భూస్వామితో సంబంధం లేకుండా గతంలో కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసే వారని, వైసిపి ప్రభుత్వం కౌలు రైతు గుర్తింపు కార్డుల జిఒను మార్పు చేసి సాగుదారులైన కౌలు రైతులను మోసం చేస్తోందని అన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధికి రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని చెప్పారు. జిల్లాలో మౌలిక వసతులు కల్పించాలని, కోటిపల్లి రైల్వే లైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి, జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం, టి.నాగవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలను కొనసాగిద్దాం

- వర్ధంతి సభలో భాస్కరయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను కొనసాగిస్తామని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య అన్నారు. చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభను కర్నూలులోని కార్మిక కర్షక భవనంలో రజక సంఘం జిల్లా నాయకులు సి. శేషాద్రి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. భాస్కరయ్య మాట్లాడుతూ.. వెట్టి చాకిరి విముక్తి కోసం, భూమి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ చరిత్రను ఈ తరం గుర్తుపెట్టుకోవాలన్నారు. పోరాట పటిమతో రజకులకు ఘన కీర్తిని సంపాదించి పెట్టారని తెలిపారు. చాకలి ఐలమ్మ చరిత్ర ఆంధ్ర, తెలంగాణలకే కాక యావత్ భారతదేశంలో ఉన్న రజకులకు గర్వ కారణమని అన్నారు.వివాహం అనంతరం ఆనాటి ప్రజలపై దాడులు చేస్తున్న భూస్వాములు, నిజాం నవాబుకు సంబంధించిన

చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రజాకార్లకు వ్యతిరేకంగా ఆమె ప్రజలను ఐక్యం చేసి పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. 1985 సెప్టెంబర్ 10న అనారోగ్యంతో ఆమె మరణించారని చెప్పారు. వృత్తిదారుల సంఘం నాయకులు జి.రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. గురుశేఖర్ మాట్లాడుతూ.. ఐలమ్మ, రామకృష్ణ ఆశయ సాధన కోసం అందరూ ఐక్యంగా వివక్ష లేని సమాజం కోసం పనిచేయాలన్నారు. కర్నూలు ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రజక వృత్తిదారుల సమస్యలు పట్ల నిజమైన చిత్తశుద్ధితో పనిచేస్తున్న సంఘం ఆంధ్రప్రదేశ్ వృత్తిదారుల సంఘం అని తెలిపారు.

సిబ్బంది బాగా పనిచేయాలి : అతుల్‌సింగ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు సిబ్బంది బాగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎపిఎస్-ఎల్‌పిఆర్‌బి) చైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. శనివారం రాయలసీమ జోన్ పరిధిలో కర్నూలు ఎపిఎస్‌పి2వ బెటాలియన్‌లో నిర్వ హిస్తున్న ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. అభ్యర్థుల బయోమెట్రిక్, ఎత్తు, బరువు, ఛాతీ కొలతల పరికరాలను, కంప్యూటం "లో సర్టిఫికెట్ల అప్‌లోడ్ స్కానర్లు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్స్‌ను పరిశీలించారు. ఫిజికల్ మెజర్‌మెంట్స్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులలో పాల్గొన్న అభ్యర్థులతో కొద్దిసేపు మాట్లాడారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- నేటి నుంచి రైతు సంఘాల నేతల జిల్లాల పర్యటన
- 15 నుంచి సచివాలయాల్లో వినతులు
- 25న మండల కేంద్రాల్లో ధర్నాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం, మరోవైపు కరువు ఛాయలు నెలకొన్నప్పటికీ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శనివారం సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్య పరిచి రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఈ నెల 10 నుంచి మూడు సంఘాల ప్రతినిధుల బృందాలు జిల్లాల పర్యటన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 25 వరకు సచివాలయాల్లో రైతాంగ సమస్యలపై వ్యక్తిగత అర్జీలు ఇవ్వాలని, 25న తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శివనాగరాణి, అప్పలస్వామి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న అన్ని ప్రాంతాలనూ కరువు ప్రాంతాలుగా గుర్తించాలని, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని, పంటలు వేసి నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం ఇవ్వాలని, పంటలను బట్టి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాభావం వల్ల పంటలు వేయలేక బీడు పెట్టిన భూముల రైతులకు ఎకరాకు రూ.20 వేలు జీవనభృతిగా ఇవ్వాలని, కరువు ప్రాంతాల్లో కౌలు రైతులకు అక్కడి పరిస్థితులను బట్టి కౌలును పూర్తిగా రద్దు చేయాలని, రైతులు, కౌలు రైతులకు అన్ని రకాల రుణమాఫీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు, పేద రైతులకు జీవనోపాధి కోసం ఉపాధి హామీ పథకం 100 రోజులు అదనంగా పనులు కల్పించాలని, కరువు సహాయం కింద ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంచి విద్యతో మెరుగైన భవిష్యత్తు

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఘనంగా ఎయు స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మంచి విద్య మెరుగైన భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ 87, 88, 89, 90 సంయుక్త స్నాతకోత్సవం శనివారం జరిగింది. ముందుగా ముఖ్య అతిథి జిఎం.రావుకు వర్సిటీ డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ ఆఫ్ లిటరేచర్‌ను ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు, డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను అల్లూరి ఇంద్రకుమార్‌కు ప్రదానం చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా నజీర్ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వ్యక్తులు తమ ప్రగతితోపాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయం అన్ని తరగతుల విద్యార్థులనూ స్వాగతించి స్థానం కల్పిస్తుందన్నారు. అట్టడుగు, దిగువ మధ్యతరగతి వారి మార్పునకు విద్య చోదక శక్తిగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వారి అవసరాలను పరిష్కరిస్తుందని చెప్పారు. ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత విద్య జ్ఞాన నిధిగా, దేశంలోని అత్యంత పురాతన విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలుస్తోందని

కొలకలూరి ఇనాక్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కొనియాడారు. విశ్వవిద్యాలయం తొలి రోజుల్లో దార్శనికులైన సర్ సిఆర్.రెడ్డి, భారత తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ, యుజిసి తొలి చైర్మన్ డాక్టర్ విఎస్.కృష్ణ వంటి వారి సారథ్యంలో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎయు పేరు వింటేనే తెలుగు ప్రజల హృదయాలు పులకిస్తాయన్నారు. విలువైన మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా విద్యకు అత్యధిక ప్రోత్సాహం ఇస్తున్నామని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యను బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. స్నాతకోత్సవంలో ప్రదానం చేసే బెస్ట్ రీసెర్చర్ అవార్డ్‌లను ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య బి.మోహన్ వెంకటరామ్, ఆచార్య వజీర్ మహ్మద్‌లకు గవర్నర్ ప్రదానం చేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను వేదిక పైనుంచే ప్రారంభించారు. కార్యక్రమంలో విసి పివిజిడి ప్రసాద్‌రెడ్డి, జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. స్నాతకోత్సవంలో 690 మందికి పిహెచ్‌డిలు, 600 మందికి మెడల్స్ అందజేశారు.

సాధారణ బీమా కంపెనీల ప్రీమియంలో వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఆగస్టులో సాధారణ బీమా కంపెనీల ప్రీమియం వసూళ్లు 12.8 శాతం పెరిగి రూ.19,290.70 కోట్లకు చేరాయి. 2022 ఆగస్టులో రూ.17,101.72 కోట్ల ప్రీమియం వసూళ్లయ్యింది. గడిచిన నెలలో బజాజ్ అలయంజ్ ఇన్సూరెన్స్ రికార్డ్ స్థాయిలో 64.27 శాతం వృద్ధితో రూ.1677.87 కోట్ల ప్రీమియంను నమోదు చేసింది. ఈ రంగంలో అత్యధిక మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ 2.63 శాతం పెరుగుదలతో రూ.2,310.59 కోట్ల ప్రీమియం వసూలు చేసింది. ఎస్‌బిఐ జనరల్ ఇన్స్యూరెన్స కంపెనీ 17 శాతం పతనంతో రూ.1,246.48 కోట్ల వసూళ్లు చేసింది. 2023 ఆగస్టులో జీవిత బీమా కంపెనీలు నూతన ప్రీమియం వసూళ్లలో 18.47 శాతం తగ్గుదలతో రూ.26,788 కోట్లకు పరిమిత మయ్యాయి. 2022 ఆగస్టులో ఈ సంస్థలు రూ.32,856.38 కోట్ల నూతన ప్రీమియంను వసూలు చేశాయి.

రాణించిన ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్

ముంబయి : గ్యారెంటీ బెనిఫిట్ ఉత్పత్తుల విక్రయంలో 158 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. హామీ ఇవ్వబడిన ప్రయోజన ఉత్పత్తులకు పెరుగుతున్న వినియోగదారుల ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని ఆ సంస్థ పేర్కొంది.

2019-20 నుంచి 2022-23 మధ్య కాలంలో హామీ ఇవ్వబడిన పొదుపు ఉత్పత్తుల విభాగంలో 158 శాతం పెరుగుదలను నమోదు చేశామని ఆ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వినోద్ హెచ్ పేర్కొన్నారు.

రిలయన్స్ రిటైల్ అప్పుల్లో 73 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ (ఆర్ఆర్ఎల్) అప్పులు భారీగా పెరిగిపోతున్నాయి. 2022-23లో ఈ సంస్థ రూ.32,303 కోట్ల అప్పులు తీసుకుందని ఎకనామిక్ టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. వేగంగా వ్యాపార విస్తరణ కోసం ఈ రుణ నిధులను ఉపయోగించినట్లు తెలుస్తోంది. దీంతో సంస్థ మొత్తం అప్పులు 73 శాతం పెరిగి రూ.70,943 కోట్లకు చేరాయి. 2021-22 ముగింపు నాటికి రూ.40,756 కోట్ల అప్పులను కలిగి ఉంది. తాజా వార్షిక నివేదికలో రూ.19,243 కోట్లు దీర్ఘకాల రుణాలున్నాయి.

"గడిచిన ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ కొత్తగా 3,300 కొత్త అవుట్‌లెట్‌లను తెరవడంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరాయి. ఈ ఏడాది కూడా వేగవంతమైన విస్తరణ కొనసాగనుంది. జనసాంద్రత కలిగిన చిన్న పట్టణాల్లోనూ విస్తరించనున్నాము." అని పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని ఓ రిలయన్స్ ప్రతినిధి పేర్కొన్నారు. బ్యాంక్‌ల అప్పులను వచ్చే ఏడాది కాలంలోనే తిరిగి చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. ఇటీవల ఆర్ఆర్‌విఎల్‌లో



0.99 శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ.8,278 కోట్ల నిధులను సమీకరించింది. వచ్చే కొన్ని నెలల్లో 8-10 శాతం వాటాలను అమ్మే యోచనలో ఉందని సమాచారం. "రిలయన్స్ రిటైల్ యొక్క దీర్ఘకాలిక రుణాల పెరుగుదల కారణంగా స్టోర్‌ల నిర్వహణ సామర్థ్యాన్ని విస్తరించేందుకు, జియోమార్ట్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయడానికి నిధులు సమకూర్చుకుంది." అని బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ వ్యవస్థాపకుడు మోహిత్ యాదవ్ అంచనా వేశారు.

PUBLIC NOTICE

My client K V.Sarma, S/o late K. Suryanarayana sarma , aged 76 years, residing at H.no. 54-14-4/2, Srinivasanagar, State bank of india colony , Ring road , Gunadala 520008, has lost the Original Sale Deed at his residence, bearing document :- no.321/1992 dated 29-1-1992, within the Sub-Registration District of Hosur comprised in Survey No.149/2 . pertaining to our immovable property situated at Vacant Land situated at 24, Eachangur Village, Hosur Taluk, Dharmapuri District, Tamilnadu State, bearing Unit No.14 in VGP Rose Land Part-II, admeasuring 0.22 Cents. If any person who may be in possession of such document may kindly return to the below mentioned address within 7 days from the date of issue of this Public Notice.

K.V. Achuta Rama Rao
Advocate,
Flat No. 101, A- Block, Surya Jyothi Apartments, Plot No.381 & 382, Opp: Vijetha Super Market, 6th Phase. KPHB Colony, HYD-85.-T.S.
MobILE No. 9849113892

సంపాదకీయం

ప్రోత్సాహం

'మనం విజయం కోసం పెట్టే ఖర్చు...ఆ విజయంకన్నా ఎక్కువే' అంటారు. 'ఈ లోకంలో మంచీ, చెడూ అనేది ఏదీ లేదు. మన ఆలోచనలే వాటిని అలా కనిపించేట్టు చేస్తాయి' అంటాడు షేక్స్‌పియర్. 'ఒక వ్యక్తి మనసులో ఎటువంటి ఆలోచనలైతే వుంటాయో...అతను అలాగే రూపొందుతాడు' అంటాడో రచయిత. 'ఆలోచనలే ఈ ప్రపంచాన్ని పాలిస్తాయని గొప్ప మనీషి అయినవాడు గ్రహిస్తాడు' అంటాడు 'పారడైజ్ లాస్ట్' అనే మహాకావ్యంలో మిల్టన్. ప్రేరణ, ప్రోత్సాహం, వ్యక్తిగత ఎదుగుదలకు అవసరం. ప్రోత్సాహం...అనేది ఎదురుదెబ్బలను అధిగమించడానికి, నిరుత్సాహం నుంచి బయటపడటానికి ఒక భరోసానిస్తుంది. ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే...ఈ ప్రపంచంలో సాధించలేనిదంటూ ఏదీ వుండదు. ఇది వ్యక్తిగత, సామూహిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. 'అడుగుల్లాంటివే ప్రగతిశీలి ఆలోచనలు/ అవరోధాలెదురయితే అవి అక్కడే ఆగిపోవు/ పురోగమనమే వాటి నిరంతశీలం/ ప్రలోభాలను కాళ్ల మునివేళ్లతో పక్కకు తోసి/ ముందుకు సాగే నిశ్చల చిత్తవృత్తి ఆ అడుగులది' అంటారు సినారె. మనం ఇతరులను ప్రోత్సహించినప్పుడు సవాళ్లను ఎదుర్కోడానికి, లక్ష్యాలను సాధించడానికి, అడ్డంకులను అధిగమించడానికి ఆ ప్రోత్సాహం వారికి శక్తినిస్తుంది. ప్రోత్సాహం అనేది కేవలం ఒక పదం కాదు... ఇది వ్యక్తిలోని ధైర్యాన్ని, దృఢనిశ్చయాన్ని రగిలించే శక్తి. ఆ ప్రోత్సాహ శక్తి అడుగడుగునా వెన్నంటే వుంటుంది. మునుముందుకు నడుపుతుంది.

కాలంతోపాటు కొత్త ఆలోచనలు చిగురిస్తూనే వుంటాయి. ఆ ఆలోచనలకు సరైన ప్రోత్సాహం లభిస్తే... ఆ ఆచరణ అప్పుడే విచ్చుకున్న తొలిపొద్దులా మనోహరంగా వుంటుంది. ఆచరణకు, పురోగమనానికి ప్రోత్సాహం కీలకం. విజయానికి కావాల్సింది... పది శాతం ప్రేరణ, తొంభై శాతం కఠోర శ్రమ' అంటాడు థామస్ అల్వా ఎడిసన్. ఒక కుర్రాడికి ఫుట్‌బాల్ అంటే చచ్చేంత ఇష్టం. హైస్కూలుకి వచ్చీరాగానే ఫుట్‌బాల్ టీంలో చేరాలని తెగ ఉబలాటపడిపోయేవాడు. అయితే, ఆ కుర్రాడు పీలగా, పొట్టిగా ఉండటంతో ఎవరూ అతడ్ని పట్టించుకోలేదు. కానీ, ఆ కుర్రాడి తండ్రి అతని వెన్నంటే ఉండి ప్రోత్సహించేవాడు. ఎప్పటికైనా నీకు జట్టులో చోటు దొరుకుతుందంటూ వెన్ను తట్టేవాడు. ఆ కుర్రాడి శ్రమ, ప్రాక్టీసులో అతని ఆటతీరు చూసిన జట్టు సభ్యులు ఓ అవకాశం ఇవ్వాలనుకుంటారు. అన్నట్టుగానే అవకాశం వస్తుంది. ఒంటి చేత్తో జట్టును గెలిపిస్తాడా కుర్రాడు. కానీ, ఆ తర్వాత ఆ కుర్రాడు కనబడకపోవడంతో...జట్టు కోచ్ వెదుక్కుంటూ... అతనుండే ఓ చిన్న పాకలోకి వెళతాడు. తన తండ్రి ఫొటోకు దండవేసి వుండటం చూసి, ఎప్పుడు జరిగిందని అడుగుతాడు. 'మన మ్యాచ్ జరిగిన రోజు తెల్లవారుజామున' అని చెబుతాడా కుర్రాడు. దీంతో కోచ్ ఆ కుర్రాడిపై కోప్పడతాడు ఎందుకు చెప్పలేదని. 'ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడాలని నా తండ్రి ఎప్పుడూ ప్రోత్సహించేవాడు. ఆయన బతికుండగా అవకాశం దొరకలేదు. ఆయన చనిపోయిన రోజునైనా నేనా లక్ష్యాన్ని సాధించడం చూసి, ఆయన సంతోషిస్తాడనుకున్నా. మైదానంలోని వేలమంది జనంలో ఓ మూలన కూర్చుని ఉండే మా నాన్నే నా మనసులో ఉన్నాడు. ఆయన తృప్తి కోసమే ఆడాను' అంటాడా కుర్రాడు. ప్రోత్సాహం ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. లక్ష్యాన్ని సాధించేందుకు బాసటగా నిలుస్తుంది.

'సమస్యలొస్తే గందరగోళ పడకు...నువ్వు విజయం సాధించవలసిన పరీక్షలుగా భావించి వాటిని అధిగమించు' అంటాడు కారల్‌మార్క్స్. పిల్లలకు చదువుతో పాటు వారికి ఇష్టమైన వ్యాపకాలలో ప్రోత్సహిస్తే... తమ శక్తియుక్తులను ప్రతిభావంతంగా ప్రదర్శించగలుగుతారు. అలాగే, రైతులకు సరైన ప్రోత్సాహాన్ని అందిస్తే... మట్టిని బంగారంగా మార్చగలరు. 'నీకేం తెలుసు?' అని కించబరిచే మహిళలకు...ఒక్క అవకాశం ఇస్తే ఆకాశం అంచులను తాకిరాగలరు. అలాగే, ఉత్పాదక రంగంలో ప్రోత్సాహం కీలకపాత్ర వహిస్తుంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ 12న జరుపుకునే 'జాతీయ ప్రోత్సాహక దినం'... పాలకులు సృష్టిస్తున్న నైరాశ్యం నుంచి బయటపడేందుకు చిరు ప్రోత్సాహం. ఈ చిరు ప్రోత్సాహం కొండంత అండ.

మంచి మాట

మనకు దృఢ సంకల్పం ఉండాలి. మన లక్ష్య పథం మధ్యలో ఏవో స్వల్ప ప్రయోజనాలు సిద్ధిస్తే వాటితో తృప్తి పడకూడదు. అంతిమ లక్ష్యం సాధించే వరకూ పట్టిన పట్టు విడువకూడదు.

- నేతాజీ సుభాష్ చంద్రబోస్

ప్రాంతీయుల కలహాలు, బిజెపి వ్యూహాల మధ్య ...

ప్రస్తుతం

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో వైసిపి, టిడిపి రాజకీయ కలహాలు పరాకాష్టకు చేరాయని చెప్పాలి. అటు చంద్రబాబు ఇటు మంత్రులూ తమ తమ కోణాల్లో అరెస్టు జరుగుతుందనే చెబుతున్నారు. రూ.371 కోట్ల ఎ.పి స్కిల్ స్కామ్‌లో ఆయనను అరెస్టు చేయవలసి వచ్చిందని సిఐడి, ప్రభుత్వం చెబుతున్నా ఈ కథ గతంలోనే మొదలైంది. చంద్రబాబుకు ఇన్‌కం టాక్స్ శాఖ నుంచి అప్రకటిత ఆదాయాలకు సంబంధించి నోటీసు వచ్చిందని హిందూస్థాన్ టైమ్స్ పత్రిక ప్రత్యేక కథనం ఇచ్చిన రోజు నుంచి ఊహాగానాలు, ఉద్రిక్తతలూ ముదురుతూ వచ్చాయి. నిజానికి ఇది 2019 అంటే చంద్రబాబు పాలనలో ఆఖరి సంవత్సరం అదీ ఎన్నికల ముందటి కాలానికి సంబంధించిన సమస్య. ఆ అప్రకటిత ఆదాయంపై 2020-21లో మదింపు వేసినప్పుడు అప్రకటిత మొత్తం వున్నట్టు గుర్తించామని ఐ.టి నోటీసు పేర్కొంది.

తెలకపల్లి రవి

అమరావతిలో నిర్మాణాలు చేసిన షాపుర్జీ పల్లంజీ సంస్థ సబ్ లీజ్‌దారైన ఎంపిపి తరపున మనోజ్ వాసుదేవ్ పార్థసాని అనే మధ్య దళారీ నుంచి రాజకీయ విరాళంగా ఈ మొత్తం తీసుకోవడానికి నాటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఒత్తిడి చేసి తెప్పించినట్టు కూడా తెలిపింది. పార్థసానిపై ఐ.టి తనిఖీలు జరిపినప్పుడు ఈ వివరాలు తన ద్వారా తెలిశాయనీ, వివరమైన వాంగ్మూలం ఇచ్చాడని ఐ.టి హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఆఫీసు చంద్రబాబుకిచ్చిన నోటీసులో తెల్పింది. ఒక వ్యక్తిపై తనిఖీలు జరుపుతుంటే మరొకరి వివరాలు బయటపడితే 153(సి) కింద నోటీసు ఇవ్వడం పరిపాటి. ఈ నోటీసుపై చంద్రబాబు సాంకేతిక అభ్యంతరాలు తెల్పుతూ నాలుగు లేఖలు రాశారు. తనకు నోటీసు ఇవ్వాల్సింది జ్యుడిషియల్ అసెస్‌మెంట్ ఆఫీసర్ తప్ప ఈ కార్యాలయం కాదని వాదించారు. ఐ.టి నాలుగుసార్లు ఆయన వాదనను తోసి పుచ్చుతూ ఈ ఆగష్టు మొదట్లో మరో నోటీసు పంపి విచారణకు రావలసిన తేదీని నిర్దేశించింది. ఈ విషయం హిందూస్థాన్ టైమ్స్ రాసిన తర్వాత బయటికి వచ్చింది గానీ నిజానికి వైసిపి నేతలు ప్రభుత్వ ప్రతినిధులు చాలా కాలంగా ఇలాంటిది జరుగుతుందని చెబుతూ వచ్చారు. అయితే ఐ.టి కేంద్ర పరిధి లోది గనక వారి నిర్ణయం కోసం ఎదురుచూశారు. నోటీసు ఇవ్వడం తప్ప కేంద్రం ఎలాంటి చర్య కోసం ఆలోచించక పోవడం, ఈలోగా చంద్రబాబు బిజెపికి దగ్గర కావడానికి ప్రయత్నించడం వారిని నిరుత్సాహ పర్చింది. అందుకే ఈ సమయంలోనే ఇతర కుంభకోణాలను లేదా ఆరోపణలను తవ్వితీయడం మొదలెట్టారు. ఎ.పి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, అమరావతి భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్‌రోడ్, ఫైబర్ నెట్... ఇలా సిఐడితో ఒక జాబితా తయారు చేయించారు. వీటిలో కొన్ని దర్యాప్తులు, అరెస్టుల వరకూ వచ్చాయి. అందులో పెద్దదీ, సూటిగా దొరికింది స్కిల్ కుంభకోణం.

ఇప్పుడు ఐ.టి నోటీసులోనూ స్కిల్ కుంభకోణంలో వలెనే ఐ.టి విషయంలోనూ కేంద్రం తీవ్ర చర్య తీసుకుంటుందని వైసిపి ఎదురు చూసింది. అది జరక్కపోవడంతో ఎన్నికలు త్వరలో వచ్చేస్తాయి గనక తనే రంగంలోకి దిగింది. ఇదే వైఖరి ఇకముందూ కొనసాగే పరిస్థితి కనిపిస్తున్నది. వీటిపై తరచూ టిడిపి, జనసేన కూడా కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అంశాలలో పరిధిలో పదేపదే కేంద్రం జోక్యాన్ని ఆహ్వానించడం హానికరమైన విషయం. వీటిని అవకాశంగా తీసుకుని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావలసినవి కూడా నిరాకరిస్తున్నది. బిజెపితో ప్రత్యక్ష, పరోక్ష స్నేహాలు చేసిన పార్టీలు నేర్చుకోడానికి నిరాకరిస్తున్న గుణపాఠం ఇది.

ఏమిటీ కుంభకోణం?

ఈ వ్యవహారంలో చంద్రబాబు ప్రత్యక్ష పాత్ర ఎంత, ఏమిటి అనే విషయం పక్కన పెడితే స్కిల్ స్కాం పెద్దదే. కొంచెం విపరీతమైంది కూడా. జిఎస్‌టి ఎగవేతలపై రైల్వేలకు సంబంధించి ఐటిఆర్‌సి ఆర్జా శ్రీకాంత్ అనే వ్యక్తిని 2017 చివరలో అరెస్టు చేసినపుడు అనుకోకుండా ఇది బయటికి వచ్చింది. అంటే అప్పటికి ఇంకా చంద్రబాబు అధికారంలో వున్నారు. అప్పుడప్పుడే బిజెపి కూటమి నుంచి బయటికి వచ్చే పరిస్థితి. ఈ కారణంగానే కేంద్రం దీన్ని కదిలించిందని, తనపై చర్య తీసుకోవచ్చనీ ఆయన భావించారు. తనను అరెస్టు చేయమని శాసనసభలో తీవ్ర ప్రసంగం చేయడం గుర్తుండే వుంటుంది. కారణాలేమైనా ఆ పని జరగలేదు. వై.ఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021లో దీన్ని మళ్లీ కదిలించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గానూ దానికి సంబంధించిన ఇతర వ్యవస్థలలోనూ కీలక పదవులు నిర్వహిస్తున్న గంటా సుబ్బారావు, ఐఎఎస్ మాజీ అధికారి లక్ష్మీనారాయణలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసింది. అప్పట్లో అది వివాదమైంది కూడా.

జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ పేరు చెప్పి ప్రభుత్వం నుంచి రూ.317 కోట్లు కొల్లగొట్టారనేది ఇక్కడ కేసు. సీమెన్స్ కంపెనీ మన యువత నైపుణ్య శిక్షణ కోసం రూ.3000 కోట్లు సహాయం చేస్తుందని, అందులో పదిశాతం మనం ఇస్తే సరిపోతుందని కథ మొదలైంది. కొన్నాళ్ల తర్వాత దానికోసం పదోవంతుగా రూ.300 కోట్లకు పైగా విడుదల అయింది. సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా లిమిటెడ్ డిజైన్‌టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు నిధులు బదిలీ అయ్యాయి. అయితే అసలు సీమెన్స్ నుంచి రావలసిందేమీ రాలేదు. తమకు ఈ ఒప్పందంతో సంబంధమే లేదని సీమెన్స్ అధికారికంగా ప్రకటించింది. అంటే ఎవరో బోగస్ సంస్థతో ఆ మొత్తం తీసుకున్నారని స్పష్టమైంది. ఈ నిధుల విడుదలకు క్యాబినెట్ ఆమోదం లేదు. అప్పుడు ఫైనాన్స్ సెక్రటరీగా వున్న పి.వి రమేష్, సి.ఎస్ గా వున్న ఐ.వై.ఆర్ కృష్ణారావు ఇందుకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి నోట్ రాసినట్టు కూడా నమోదైంది. అన్నిటినీ మించి తమకు ఈ వ్యవహారంతో సంబంధం లేదని సీమెన్స్ ప్రకటించింది. అంటే ఇదంతా మోసపూరితంగా జరిగిందని స్పష్టమైనట్టు పోలీసులు చెబుతున్నారు. ఇందులో మనీ లాండరింగ్ కూడా వుంది గనక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగ ప్రవేశంచేసి నలుగురిని అరెస్టు చేసింది. కోర్టులోనూ కేసు నమోదైంది. దీనికి సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లో 38వ నిందితునిగా చంద్రబాబు పేరుంది. అయితే అభియోగ కథనంలో మాత్రం ఆయన పాత్రను ముఖ్యంగా పేర్కొన్నట్టు సిఐడి వారు చెబుతున్నారు. ఆ వివరాలు అడిగితే 24 గంటల్లో ఇస్తామని చెప్పారు. ఐపిసి సెక్షన్ 50 కింద అరెస్టు చేసినపుడు కేసు వివరాలు ఆరోపణల పత్రాలు సమర్పించాలని న్యాయవాదులు వాదిస్తున్నారు. ముందే చెప్పినట్టు ఇతర కుంభకోణాలలో కూడా ఇదే విధమైన లింకులు వున్నట్టు, అవసరమైనదానికన్నా అధికంగానే ఆధారాలున్నాయని సిఐడి అధికారి సంజయ్ మీడియాకు చెప్పారు. వాటిపై కోర్టు స్పందనను బట్టి చంద్రబాబు రిమాండ్ సాధ్యమా కాదా అనేది ఆధారపడి వుంటుంది.

కేంద్రం కుటిలనీతి

ఏ కుంభకోణం లేదా అవినీతి, అక్రమాలు జరిగినా తప్పక విచారణ జరగవలసిందేగాని అవి కక్ష సాధింపు సాధనాలు కాకూడదన్నది ప్రజాస్వామిక సూత్రం, అమరావతిలోనైనా మరెక్కడైనా ఆరోపణలపై దర్యాప్తు, అరెస్టు అసలు జరగకూడదని కూడా ఎవరూ చెప్పలేరు. నిజానికి ఎ.పి హైకోర్టు, సుప్రీం కోర్టులే పలుసార్లు ఆ విషయం స్పష్టం చేశాయి. రాజధాని భూ లావాదేవీలపై విచారణకు సిట్ నియామకం చెల్లదని హైకోర్టు కొట్టివేస్తే సుప్రీం కోర్టు అనుమతించింది. ఒక ప్రభుత్వం తనకన్నా ముందు పాలించిన వారి హయాంలో ఏవైనా అక్రమాలు బయటపడితే విచారణ జరపాలి కదా అని వ్యాఖ్యానించింది. ఆ మేరకు పలు కేసుల దర్యాప్తు జరుగుతున్నది కూడా. అయితే రాజకీయ వైరాల కారణంగా వాటి వివరాలు లేదా అతిశయోక్తులు ముందే బయటికి లీక్ కావడం, కొన్నిసార్లు విషయాన్ని మించి కక్ష సాధింపునకు పాల్పడటం పరిపాటిగా మారుతున్నది. విశాఖలో ఈ తరహాలోనే గోడల కూల్చివేత, ఆక్రమణల తొలగింపు అంటూ దాడులు వివాదంగా మారాయి. ఏ కుంభకోణమైనా ఏ నాయకుడైనా విచారణకు అతీతం కాదని చెప్పవలసి వుంటుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ క్విడ్‌ప్రో కేసుల్లో 16 నెలలు అండర్ ట్రయల్‌గా వుండి బయటికి వచ్చారు. ఆ కేసుల విచారణ సాగుతూనే వుంది. మరోవైపున కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థి పార్టీలపై ఉసిగొలుపుతున్నదనే విమర్శలు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో ఇరువైపులా కూడా ప్రజాస్వామిక సూత్రాలు, నిబంధనలు, ప్రజా జీవితంలో జవాబుదారీ తనం సూత్రాల ప్రకారం వ్యవహరించవలసి వుంటుంది. న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం అంతిమంగా అమలవ్వాల్సిన పరిస్థితి అనివార్యమే. ఈ వాదోపవాదాలలో ఆరోపణలు, ప్రత్యారోపణలలో రాజకీయ పక్షాలు మునిగి తేలుతూ ప్రజా సమస్యలను మౌలికాంశాలనూ విస్మరించడం సరైంది కాదు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేకించి ఎ.పి లో అధికార వైసీపీ ప్రతిపక్ష టిడిపిలను అవసరాన్ని బట్టి వాడుకుంటూ రాష్ట్రంతో చెలగాటమాడుతున్నది. ఈ కుంభకోణాల్లోనూ ఐ.టి, ఈడీ వంటివి ద్వంద్వనీతి పాటిస్తున్నాయి. ప్రాంతీయ పాలకులు తమ మనుగడ కోసం కేంద్రానికి పరస్పర ఫిర్యాదులతో కలహాలతో బిజెపికి పావులవుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వంటి వారు అచ్చంగా వారి దోస్తీలోనే మునిగి తేలుతున్నారు. ఇప్పుడు ఐ.టి నోటీసులోనూ స్కిల్ కుంభకోణంలో వలెనే ఐ.టి విషయంలోనూ కేంద్రం తీవ్ర చర్య తీసుకుంటుందని వైసిపి ఎదురు చూసింది. అది జరక్కపోవడంతో ఎన్నికలు త్వరలో వచ్చేస్తాయి గనక తనే రంగంలోకి దిగింది. ఇదే వైఖరి ఇకముందూ కొనసాగే పరిస్థితి కనిపిస్తున్నది. వీటిపై తరచూ టిడిపి, జనసేన కూడా కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అంశాల పరిధిలో పదేపదే కేంద్రం జోక్యాన్ని ఆహ్వానించడం హానికరమైన విషయం. వీటిని అవకాశంగా తీసుకుని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావలసినవి కూడా నిరాకరిస్తున్నది. బిజెపితో ప్రత్యక్ష, పరోక్ష స్నేహాలు చేసిన పార్టీలు నేర్చుకోడానికి నిరాకరిస్తున్న గుణపాఠం ఇది. ఈ విధంగా రాష్ట్ర పార్టీల అవకాశవాద వ్యూహాలు, కేంద్ర బిజెపి ఆధిపత్య వ్యూహాల మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవలసి రావడం విచారకరం. ఆ క్రమంలో ఉద్రిక్తతలు, అప్రజాస్వామిక పోకడలూ అసహనాలు అవాంఛనీయం. ★

ఏ కుంభకోణం లేదా అవినీతి, అక్రమాలు జరిగినా తప్పక విచారణ జరగవలసిందేగాని అవి కక్ష సాధింపు సాధనాలు కాకూడదన్నది ప్రజాస్వామిక సూత్రం, అమరావతిలోనైనా మరెక్కడైనా ఆరోపణలపై దర్యాప్తు, అరెస్టు అసలు జరగకూడదని కూడా ఎవరూ చెప్పలేరు. నిజానికి ఎ.పి హైకోర్టు, సుప్రీం కోర్టులే పలుసార్లు ఆ విషయం స్పష్టం చేశాయి. రాజధాని భూ లావాదేవీలపై విచారణకు సిట్ నియామకం చెల్లదని హైకోర్టు కొట్టివేస్తే సుప్రీం కోర్టు అనుమతించింది. ఒక ప్రభుత్వం తనకన్నా ముందు పాలించిన వారి హయాంలో ఏవైనా అక్రమాలు బయటపడితే విచారణ జరపాలి కదా అని వ్యాఖ్యానించింది. ఆ మేరకు పలు కేసుల దర్యాప్తు జరుగుతున్నది కూడా. అయితే రాజకీయ వైరాల కారణంగా వాటి వివరాలు లేదా అతిశయోక్తులు ముందే బయటికి లీక్ కావడం, కొన్నిసార్లు విషయాన్ని మించి కక్ష సాధింపునకు పాల్పడటం పరిపాటిగా మారుతున్నది.

తెలుగు వారి చిత్రకళా సొత్తు 'వ.పా'

నివాళి

నేడు వడ్డాది పాపయ్య జయంతి



పురస్కారాలు, ప్రశంసల కోసం కొందరు బొమ్మలు గీయగా...కళ కోసం, కళాభిమానుల కోసం మాత్రమే చిత్రాలను మనకందించిన గొప్ప చిత్రకళాకారులు వడ్డాది పాపయ్య. 1921 సెప్టెంబరు 10వ తేదీన శ్రీకాకుళం పట్టణంలో సామాన్య కుటుంబంలో పుట్టిన వ.పా, బాల్యం నుంచే చిత్రకళపైన మక్కువ పెంచుకున్నారు. భారతీయ పురాణ, ఇతిహాసాలపై విద్యార్థి దశలోనే పట్టు సాధించి ఆ దిశగా తన చిత్రకళా ఆసక్తికి రంగులు, తన భావాలకు కుంచె ద్వారా మెరుగులు దిద్దుకున్నారు. ఆయన కుంచె నుంచి జాలువారిన చిత్రం లేదంటే అతిశయోక్తి కాదు. పురాణ పురుషులు, కావ్య నాయకులు, పల్లె పడుచులు, జాతీయ నేతలు, వివిధ కాలాలు, రుతువులు, పండుగలు, ఆచార వ్యవహారాలు, జానపద విన్యాసాలు, రాగాలు, నదులు, ఊహా లోకాలు....ఒకటేంటి మనిషిలోని, పకృతి లోని అన్ని భావాలు, రూపాలను తన చిత్రాల ద్వారా చూపించారు వ.పా. అందుకే ఆయన గీచిన చిత్రాల కోసం ఒకనాడు తెలుగు నేలపైన సామాన్యుడి నుంచి మేధావులు వరకూ అర్థ శతాబ్దం పాటు ఎదురు చూశారు. నేటికీ అవి సజీవ చిత్రాలుగా నిలుస్తూ ఇప్పటి తరాన్నీ అలరిస్తున్నాయి.

1940 నుంచి 1990 వరకూ తెలుగు నేలపై ప్రచురితమైన పలు పత్రికలు, జర్నల్స్‌కు వడ్డాది పాపయ్య చిత్రాలు ఊపిరిగా నిలిచాయి. ఆయా పత్రికలు ప్రచురించే కథలు, నవలలకు వ.పా గీచిన చిత్రాలు ఎంతో ప్రాచుర్యం పొందడమే కాకుండా వాటి సర్క్యులేషన్‌కు కూడా దోహదపడ్డాయి. రేఖా చిత్రకారుడిగానే కాకుండా కార్టూనిస్టుగా, బొమ్మల కథా రచయితగా బహుముఖ ప్రజ్ఞావంతుడు. 1940వ దశకంలో చిన్నారులను ఆకట్టుకోవడానికి ఆయన 'బాల' పత్రికలో గీచిన చిత్రాలు ఎంతో తమాషాగా, ఆహ్లాదంగా ఉండేవి. చిత్రాలతో పాటు యువ, ఆనందవాణి, నవ్వులు పువ్వులు తదితర పత్రికల్లో గీచిన వందలాది కార్టూన్లు తెలుగు వ్యంగ్య చిత్రకళలకు ఊత్తేజాన్ని నింపాయి. చందమామ, కథా మంజూష తదితర పత్రికల్లో ఎన్నో కథలను కూడా రాశారు. బెంగాలీ రచనలు తెలుగులోకి విరివిగా అనువాదం అవుతున్న రోజుల్లో చిత్రకారునిగా వ.పా చేసిన కృషి ఎనలేనిది. శరత్‌చంద్ర నవలలకు ఆయన గీచిన బొమ్మలు నాటి పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

నిరాడంబరత, మానవతకు దగ్గరగా, ప్రచారానికి, ప్రశంసలకు దూరంగా ఉంటూ...పంచె కట్టులోనూ, కుంచె పట్టులోనూ అసలు సిసలైన తెలుగువానికి నిలువుటద్దంగా నిలిచారు వ.పా. 'వ్యక్తి ఆరాధన వద్దు, నా ఆర్టునే ప్రేమించాలని అభిమానులకు పదే పదే చెప్పే' వడ్డాది పాపయ్య తన జీవితంలోనూ తూ.చ. తప్పకుండా పాటించారు. పత్రికలకు చిత్రాలు అందించే నిమిత్తం మద్రాస్ నగరంలో బిజీ జీవితాన్ని గడిపినప్పటికీ దాని నుంచి బయిటపడి తనకు నచ్చిన జీవన పయనంలో భాగంగా విశాఖలోని అనకాపల్లి దగ్గర వున్న చిన్న పల్లె కశింకోటకు చేరుకున్నారు. అక్కడే శారదా నది ఒడ్డున 'వ.పా వనం (010)' నిర్మించుకొని తన కుమార్తె కుటుంబంతో కలిసి చివరి రోజులు గడిపారు. 1992 డిసెంబరు 30న వ.పా తుది శ్వాస విడిస్తే ... ఒకరోజు తర్వాత ఈ లోకానికి ఆ వార్త తెలిసింది. ఆయన చిత్రకళా సేవను గుర్తించడంలో పాలకులు, పరిశోధకులు విస్మరించిప్పటికీ వారసత్వాన్ని అభిమానులు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో పలు సంస్థలు వ.పా స్మారకార్థం జయంతి, వర్థంతి రోజుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయి. వ.పా చిరకాల స్వప్నమైన ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేయాలని ఆయన అభిమానుల అభిలాష.

- డా॥ గుంట లీలావరప్రసాదరావు,
అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం, సెల్ : 8309519615

స్మృతి

చల్లపల్లి స్వరూపరాణి

అరుదైన వకీలమ్మ కత్తి చల్లమ్మ

నేరస్త జాతుల జాబితాలో చేర్చిన జాతులలో అత్యంత దీనమైన పరిస్థితి యానాదులది. నెల్లూరు జిల్లాలో ఎక్కువగా వుండే వీరి ఆవాసం శ్రీహరి కోట. పులికాట్ సరస్సులో చేపలు పట్టుకుని తృప్తిగా జీవించే వీరి ఆవాసం శ్రీహరి కోటను ఈస్ట్ ఇండియా కంపెనీ 1830లో స్వాధీనం చేసుకుని వారిని అక్కడి నుంచి తరిమి వేయడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. ఈరోజుకీ నీది ఏ ఊరు అని అడిగితే నాది ఫలానా ఊరని స్పష్టంగా, ధైర్యంగా చెప్పలేని యానాది జాతి లోంచి ఒక 'వకీలమ్మ' గత శతాబ్దపు తొలినాళ్ళలోనే రావడం అబ్బురం అనిపిస్తుంది. ఆ వకీలమ్మ పేరు కత్తి చల్లమ్మ. యానాదుల బానిస సంకెళ్ళు తెంచడానికి కృషి చేస్తూ క్రిమినల్ ట్రైబ్స్ చట్టం-1871 రద్దు కోసం 1935 నుంచి పోరాటాలు చేసి కోర్టులో యానాదుల ప్రతినిధిగా హాజరై దుర్మార్గమైన ఆ చట్టాన్ని రద్దు చేసేవరకు ఆమె విశ్రమించలేదు.

ఆదివాసులను నేరస్త జాతులుగా పరిగణించే క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని రద్దు చేయించి వారిని సంస్కరించే ప్రయత్నాలు గత శతాబ్దపు మొదటి భాగంలోనే ప్రారంభమయ్యాయి. మద్రాసు ప్రెసిడెన్సీలో నెల్లూరు జిల్లాకు చెందిన న్యాయవాది, జాతీయోద్యమ నాయకుడైన వెన్నెలకంటి రాఘవయ్య యానాదుల సంస్కరణకు పూనుకుని క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని రద్దు చేయించి వారికి స్వేచ్ఛ కల్పించడం, వారిని షెడ్యూలు ట్రైబ్స్‌గా గుర్తించి ఇతర తెగలతో సమానంగా ప్రభుత్వం నుంచి విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, రాయితీలు పొందే హక్కు కల్పించడానికి గొప్ప కృషి చేశారు. ఆయన కృషిలో కత్తి చల్లమ్మ కూడా భాగం కావడం విశేషం.

వెన్నెలకంటి రాఘవయ్య, ఆయన సహచరుడైన పట్టాభి సీతారామయ్య మద్రాసు హైకోర్టులో దుర్మార్గమైన చట్టాన్ని రద్దు చేయాలని యానాదుల తరఫున కేసు దాఖలు చేసి ప్లీడరుగా భాష్యం అయ్యంగార్ అనే వ్యక్తిని ఏర్పాటు చేశారు. క్రిమినల్ ట్రైబ్స్ చట్టం వలన యానాది జాతి అనుభవిస్తున్న కష్టాలను వివరించడానికి వారి ప్రతినిధిగా కత్తి చల్లమ్మ కోర్టుకు హాజరు కావాలని నిర్ణయించారు. యానాదులు ఇతరులు ఏది అడిగినా 'నాకు తెలవదు' అని తప్ప మరొకటి చెప్పడం చేతగాని వారు. అందుకే వారిని సాక్ష్యంగా పెట్టుకోవడం తెలివి తక్కువతనం అనే అభిప్రాయం బలంగా వున్నప్పుడు కత్తి చల్లమ్మ అనే యానాది స్త్రీ కోర్టులో తన జాతి ప్రతినిధిగా మాట్లాడడం అసాధారణం. ఆమె 1935-40 మధ్య కాలంలో ఈ కేసు విషయమై మద్రాసు హైకోర్టుకు అనేక పర్యాయాలు హాజరైంది. ఆమె మాట్లాడే తీరుకు కోర్టులో న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేయడం విశేషం. ఆమె నాయకత్వంలో 1935లో నెల్లూరులో జరిగిన యానాది మహా గర్జన ఆనాటి మీడియాని ఆకర్షించింది. అప్పుడే ఆమె అందరి దృష్టిలో పడింది. సుమారు మూడు వందల మంది యానాదులు ఇందులో పాల్గొన్నారు. యెర్ర సుబ్బయ్య అనే రైతు ఉద్యమ నాయకుడు కూడా వారికి సహకరించాడు. క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని రద్దు చేసి యానాదులను సభ్య సమాజంలో ఇతరులతోపాటు సమానంగా గుర్తించాలి, వారికి జీవనాధారం అయిన అటవీ ఉత్పత్తులు, చెరువులపై హక్కులు కల్పించాలి, వారికి వ్యవసాయ భూములు, ఇళ్ళ స్థలాలు కేటాయించాలి అనే డిమాండ్లతో జరిగిన ఈ సభ చారిత్రాత్మకమైనది. ప్రభుత్వాధినేతలు యానాదుల పోరాట పటిమను గుర్తించారు. రాఘవయ్య ప్రారంభించిన ఆదిమ జాతుల సంక్షేమ సంఘం, యానాది సంక్షేమ సంఘాలలో చల్లమ్మ క్రియాశీలకంగా పాల్గొని వారి సమస్యలపై అనేక సభలలో ప్రసంగించి అధికారులతో చర్చించింది. జవహర్ లాల్ నెహ్రూ 1952లో మద్రాసును సందర్శించినప్పుడు వారి సమస్యలు, పోరాటాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకుని చివరకు క్రినినల్ ట్రైబ్స్ చట్టాన్ని 1952లో రద్దు చేయడం జరిగింది. దీనితో దేశవ్యాప్తంగా వున్న అనేక లక్షల మంది ఆదివాసులు నేరస్తులు అనే ముద్ర నుంచి బైటపడి సమాజంలో ఇతరులతోపాటు సమానమైన సభ్యులుగా గుర్తింపు పొందారు. క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని రద్దు చేసిన తర్వాత యానాదులు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు వెదుక్కుంటూ రిక్షా పుల్లర్లుగా మారారు. వారి సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఉద్యమాలకు కూడా కత్తి చెల్లమ్మ మద్దతు పలికింది. జాతీయోద్యమంలో భాగంగా జరిగిన మద్యపాన నిషేధ ఉద్యమంలో కత్తి చల్లమ్మ క్రియాశీలకంగా పాల్గొంది. 1942లో ఉప్పు సత్యాగ్రహంలో కూడా పాల్గొంది. అయితే వెన్నెలకంటి రాఘవయ్య నెల్లూరు జిల్లాలో ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న వారందరి పేర్లు పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో రాసిపెట్టి ఆమె పేరు రాయకపోవడం గమనార్హం.

కత్తి చల్లమ్మకు బిడ్డలు లేరు. ఆమె జనం కోసం బతికింది. ఆమె సేవలను, ఆమె వ్యక్తిత్వాన్ని ప్రేమించి గౌరవించే యానాదులు నెల్లూరు పట్టణం మినీ బైపాస్ దగ్గర వుండే తమ కాలనీకి 'కత్తి చల్లమ్మ సంఘం' అని పేరు పెట్టుకున్నారు. తర్వాత యానాది మహిళ పేరున కాలనీ వుండడమేమిటని పేరు మార్చారు. ఇప్పుడు కాలనీ పేరు 'దొర తోపు సంఘం' అని మార్చినప్పటికీ ఆమె గురించి తెలిసిన తరం యానాదులకు 'కత్తి చల్లమ్మ సంఘం' అనే పేరే గుర్తు. చరిత్రలో మరుగున పడిన అరుదైన 'వకీలమ్మ' కత్తి చల్లమ్మ జీవితం, ఆమె చేసిన పోరాటాలు ఆదివాసీ చరిత్రకు నాందీ వాచకం కావాలి. చీకటిలో కుమిలిపోయిన జీవితాలలో వెలుతురు నింపిన మిణుగురు మన చల్లమ్మ. ★

జి20 అతిథులకు రాష్ట్రపతి విందు

- పలువురు ప్రతిపక్ష ముఖ్యమంత్రులు గైర్హాజరు
- అనారోగ్య కారణాలతో మన్మోహన్, దేవేగౌడ దూరం



విందుకు విచ్చేసిన బైడెన్‌కు స్వాగతం పలుకుతున్న ద్రౌపది ముర్ము, జీవ ఇంధన కూటమి ప్రతిపాదన సందర్భంగా సభ్యదేశాల అధినేతలతో మోడీ

న్యూఢిల్లీ : జి20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి తరలివచ్చిన వివిధ దేశాధినేతలు, ఇతర అతిథులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం సాయంత్రం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. సదస్సు ప్రధాన వేదిక అయిన ప్రగతిమైదాన్‌లోని 'భారత్ మండపం'లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో కలిసి రాష్ట్రపతి ముర్ము అతిథులకు స్వయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేదిక బ్యాగ్రౌండ్‌లో 'నలంద విశ్వవిద్యాలయం' చిత్రాన్ని ఉంచారు. ఈ విందులో విదేశీ అతిథులతో పాటు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు.

బంగారం, వెండి పాత్రల్లో వడ్డన

విందులో భాగంగా అతిథులకు బంగారం, వెండి పాత్రల్లో విందు వడ్డించడం విశేషం. చిరుధాన్యాలు, పనసపండుతో చేసిన గాలెట్టె (బ్రెడ్ వంటి ఫ్రెంచి వంటకం), గ్లేజ్డ్ ఫారెస్ట్ మష్రుఉమ్, చిరుధాన్యాల వంటకాలు, కేరళ రెడ్‌రైస్, వివిధ రకాల బ్రెడ్‌లతో పాటు ముంబయి పావ్ కూడా ఏర్పాటు చేశారు. డెజర్ట్‌లో యాలకులు, ఊదలతో చేసిన మధురిమ అనే పుడ్డింగ్, ఫిగ్ పీచ్ కంపోట్, ఆంబేమొహార్ క్రిస్పీస్, పాలు-గోధుమలతో చేసిన నట్స్ విందు మెనులో చోటు దక్కించుకున్నాయి. పానీయాల్లో కశ్మీరీ ఖావా, ఫిల్టర్ కాఫీ, డార్జిలింగ్ టీ, పాన్ ఫ్లేవర్డ్ చాక్లెట్ ఏర్పాటు చేశారు.

పలువురు నేతల గైర్హాజరు

ఇదిలా ఉండగా.. కేంద్ర మంత్రులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భారత ప్రభుత్వ కార్యదర్శులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలనూ ఈ విందుకు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే ఈ విందుకు మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, దేవెగౌడలు హాజరవ్వలేదు. ఆనారోగ్య కారణాల రీత్యా తాము రాలేమని వారు తెలియచేశారు. ప్రతిపక్షాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు కూడా గైర్హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఢిల్లీ సిఎం కేజ్రివాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, హిమాచాల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు హాజరైనట్లు తెలిసింది. కాగా ఛత్తీస్‌గఢ్, కర్ణాటక సిఎంలు హాజరు కాలేదు. రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్ హాజరవుతారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఈ విందుకు ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించలేదు. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. విదేశాల్లో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమాలకు హాజరుకావాల్సివున్నందున కేరళ సిఎం పినరయి విజయన్, తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్, ఒడిషా సిఎం నవీన్ పట్నాయక్ కూడా ఈ విందుకు హాజరు కాలేదు.

తొలిరోజు హైలైట్స్!

జి20 సదస్సు తొలి రోజులో భాగంగా సభ్యదేశాలు పలు కీలక అంశాలపై చర్చించాయి. ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడం, ఢిల్లీ డిక్లరేషన్‌కు ఒక రోజు ముందుగానే శనివారమే ఆమోదం తెలపడం వంటి విశేషాలు తొలి రోజే చోటుచేసుకున్నాయి. కాగా పలు సభ్యదేశాలతో భారత్ ద్వైపాక్షిక చర్చలు జరిపింది.

- ప్రపంచ జీవ ఇంధన కూటమి : ప్రపంచ జీవ ఇంధన కూటమిని ప్రారంభిస్తున్నట్లు భారత్ ప్రకటించింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపేందుకు ఉద్దేశించిన ఈ ప్రయత్నంలో భాగస్వామ్యం కావాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది.
- జి20 శాటిలైట్ మిషన్ ప్రతిపాదన: వాతావరణం, పర్యావరణ పరిశీలన కోసం ప్రత్యేకంగా 'జి20 శాటిలైట్ మిషన్'ను భారత్ ప్రతిపాదించింది. ఇందుకోసం భారత్ చేపట్టిన 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కార్యక్రమంపై నేతలు కృషిని ప్రారంభించాలని కోరారు.
- బ్రిటన్ ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు: జి20 సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పెట్టుబడులకు ఊతమివ్వడం, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు చర్చించారు. సమావేశం అనంతరం మాట్లాడిన మోడీ.. సంపన్న, సుస్థిర ప్రపంచం కోసం భారత్, బ్రిటన్‌లు కలిసి పనిచేస్తూనే ఉంటాయని అన్నారు.
- జపాన్ ప్రధానితో మోడీ భేటీ: జి20 సదస్సు నేపథ్యంలో అటు జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదాతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించామని.. అనుసంధానం, వాణిజ్యంతోపాటు ఇతర రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని ఇరునేతలు చెప్పారు.

దేశద్రోహ చట్టంపై 12న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : వలసవాదుల కాలం నాటి దేశద్రోహ చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 12న విచారిస్తుంది. మే 1న కేసు విచారణ సందర్భంగా కేంద్రం తన వాదనలు వినిపిస్తూ రాజద్రోహ చట్టానికి సంబంధించిన నిబంధనలపై సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని కోరింది. బ్రిటీష్ పాలన నాటి ఐపిసి, సిఆర్‌పిసి, ఇండియన్ ఎవిడెన్స్ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మూడు బిల్లులు ప్రవేశపెట్టిన విషయం విదితమే. దేశద్రోహ చట్టాన్ని రద్దు చేసి, నేరానికి విస్తృత నిర్వచనం ఇస్తూ నూతన నిబంధనలు రూపొందించాలని కూడా కేంద్రం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో దేశద్రోహ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ అత్యున్నత న్యాయస్థానంలో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఐపిసిలోని సెక్షన్ 124-ఏ (దేశద్రోహం) చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్థివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ నెల 12న విచారణ జరుపుతుంది. ఐపిసిలోని సెక్షన్ 124-ఏ ప్రకారం 'ప్రభుత్వం పట్ల అవిధేయత' ప్రదర్శిస్తే గరిష్టంగా యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు. స్వాతంత్ర్యం రావడానికి 57 సంవత్సరాల ముందు 1890లో దీనిని ఐపిసిలో చేర్చారు. అప్పటికే ఐపిసిని రూపొందించి దాదాపు 30 సంవత్సరాలు గడిచాయి.

స్లీప్ మోడ్ విక్రమ్ ల్యాండర్ ఫొటో విడుదల

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన ప్రతిష్టాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3కు సంబంధించిన తాజా సమాచారాన్ని ఆ సంస్థ ఎప్పటికప్పుడు అందిస్తున్నది. ప్రస్తుతం స్లీప్ మోడ్‌లో ఉన్న విక్రమ్ ల్యాండర్ ఫొటోను ఇస్రో రిలీజ్ చేసింది. చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ ఎపర్చర్ రాడార్ పరికరం ద్వారా చంద్రయాన్-3 ల్యాండర్ ఫొటోను తీసినట్లు తెలిపింది. ఈ నెల 6న తీసిన ఈ ఫొటోను శనివారం ఎక్స్‌లో ఇస్రో షేర్ చేసింది. చంద్రుడిపై లూనార్ నైట్ ప్రారంభం కావడంతో విక్రమ్ ల్యాండర్, దాని నుంచి చంద్రుడి ఉపరితలంపైకి దిగిన ప్రజ్ఞాన్ రోవర్‌ను స్లీప్ మోడ్‌లో ఇస్రో ఉంచింది. మరోవైపు ఈ నెల 22న చంద్రుడిపై తిరిగి లూనార్ డే ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై సూర్యుడి కాంతి కిరణాలు పడే ఈ సమయం కోసం ఇస్రో ఎదురుచూస్తున్నది. అయితే లూనార్ నైట్ సమయంలో చంద్రుడి ఉపరితలంపై ఉండే మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వంటి పరిస్థితులను ల్యాండర్, రోవర్ తట్టుకుని తిరిగి అవి పనిచేస్తాయా అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



దేశాధినేతలకు కరీంనగర్ బ్యాడ్జీలు

న్యూఢిల్లీ : జి-20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో తెలంగాణలోని కరీంనగర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ సదస్సులో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకారుల కళాత్మక బ్యాడ్జీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులు వెండి తీగతో ప్రత్యేకంగా రూపొందించిన 'అశోక చక్ర' బ్యాడ్జీలు దేశాధినేతల సూట్‌పై తలుకులీనాయి. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల కిందటే ఈ సిల్వర్ ఫిలిగ్రీ బ్యాడ్జీల కోసం ఆర్డర్ చేసింది. దీంతో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులు 200 అశోక చక్ర బ్యాడ్జీలను తయారుచేసి ఢిల్లీకి తీసుకెళ్లారు.

తల్లుల నుండి పిల్లలను వేరు చేయొద్దు : ఎస్ఎన్ఎస్

లండన్ : బ్రిటన్‌లోనూ, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లోనూ కుటుంబ కోర్టులు పిల్లలను, తమ తల్లుల నుండి లాక్కుంటున్నాయని స్వచ్ఛంద సహాయ సంస్థలు, ప్రచార కార్యకర్తలు తెలిపారు. లండన్‌లో భారత హై కమిషన్ కార్యాలయం ముందు వారు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. సపోర్ట్ నాట్ సెపరేషన్ (ఎస్ఎన్ఎస్) గ్రూపు ఈ ప్రదర్శన నిర్వహించింది. సంపన్న దేశాల్లో పనిచేసుకుంటూ జీవిస్తున్న ఇమ్మిగ్రెంట్ కుటుంబాలకు చెందిన పిల్లలను ఇలా వేరుర చేయడం ఎక్కువైందని ఆందోళనకారులు పేర్కొంటున్నారు. తక్కువ ఆదాయంతో బతికేవారు, సింగిల్ పేరెంట్, గృహ హింస బాధితులు ఇలాంటి వారి నుండి పిల్లలను వేరు చేయడం ఇటీవల బాగా ఎక్కువైందని ఎస్ఎన్ఎస్ తెలిపింది.

మయన్మార్ సంక్షోభంపై దృష్టి సారించండి

- సైన్యం దూకుడును అడ్డుకోండి
- లేకుంటే పరిస్థితి మరింత విషమిస్తుంది
- జి20 సదస్సుకు 44 సంస్థల వినతి

న్యూఢిల్లీ : మయన్మార్‌లో నెలకొన్న సంక్షోభంపై తక్షణమే దృష్టి సారించాలని ప్రపంచ దేశాలకు చెందిన 44 సంస్థలు జి20 దేశాధినేతలను కోరాయి. జి20 దేశాల అధిపతులు, ప్రభుత్వాధినేతలు న్యూఢిల్లీలో సమావేశమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా సంఘాల ప్రతినిధులు శనివారం ఓ బహిరంగ లేఖ రాశారు. 'మయన్మార్‌లో సైనిక జుంటా వేధింపులు పెచ్చుమీరిపోయాయి. దీనిపై తక్షణమే, అందరూ కలసికట్టుగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్థిక దేశాలుగా మీరు మీ పలుకుబడిని ఉపయోగించి సమస్యను పరిష్కరించాలి. అది మీ నైతిక బాధ్యత. మయన్మార్‌లో నెలకొన్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత 30 నెలల్లో నాలుగు వేల మందికి పైగా చనిపోయారు. ఇరవై నాలుగు వేల మందిని అక్రమంగా నిర్బంధించారు. 145 మందికి మరణశిక్ష విధించారు. ఇవి ఎఎపిపి సంస్థ విడుదల చేసిన గణాంకాలు. వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది. మయన్మార్ సైన్యం పౌరులను లక్ష్యంగా చేసుకొని 1,400కు పైగా వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల కారణంగా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. మయన్మార్‌లో 17 లక్షల మంది నిరాశ్రయులయ్యారని ఐరాస అంచనా వేసింది. ఈ సంవత్సరాంతానికి ఆ సంఖ్య 27 లక్షలకు చేరవచ్చు' అని ఆ సంస్థలు వివరించాయి.

మయన్మార్ సైనికులు 75 వేల ఇళ్లను తగలబెట్టారని, ఆ దేశంలో 1.7 కోట్ల మంది ప్రజలు మానవతా సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారని ఆ సంస్థలు తమ బహిరంగ లేఖలో తెలియజేశాయి. 'మయన్మార్ సంక్షోభం ఇప్పుడు సరిహద్దులు దాటింది. దీనిని జి20 దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఐదు కోట్ల మంది ప్రజల ఇబ్బందులను, ప్రాంతీయ భద్రతకు ఎదురవుతున్న ముప్పును కేవలం ఒక దేశం యొక్క ఆంతరంగిక వ్యవహారంగా చూడకూడదు. మయన్మార్ సైన్యానికి సహాయం అందించే ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే. ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇంధనం, దౌత్యపరమైన బాసట వంటివి అందించడం ద్వారా సైనికుల వేధింపులకు, అకృత్యాలకు సాయపడే వారిని బాధ్యులుగా చేయాలి. మయన్మార్ సైన్యంతో సంబంధాలు తెంపుకొని, నేషనల్ యూనిటీ ప్రభుత్వానికి చేయూత అందించాలి. మయన్మార్‌లో ఐదు కోట్ల మందికి పైగా ప్రజల జీవితాలు గాలిలో దీపంలా మారాయి. సైనికుల అకృత్యాలపై చర్యలు చేపట్టకపోతే రోజురోజుకూ పరిస్థితి మరింత దుర్భరంగా మారుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జి20 దేశాలు సకాలంలో నిర్దిష్టమైన, సమర్థవంతమైన చర్యలు తీసుకొని సైనిక పాలకుల ఆగడాలకు కళ్లెం వేయాలి' అని బహిరంగ లేఖలో ప్రపంచ దేశాలకు చెందిన 44 సంస్థలు కోరాయి. బహిరంగ లేఖ రాసిన సంస్థల్లో మిల్క్ టీ అలయన్స్ ఫ్రండ్స్ ఆఫ్ మయన్మార్, ది యాక్షన్ కమిటీ ఫర్ డెమొక్రసీ డెవలప్‌మెంట్ (14 నెట్‌వర్క్‌ల కూటమి), ఆసియాన్ పార్లమెంటేరియన్స్ ఫర్ హ్యూమన్ రైట్స్, ఇండియా ఫర్ మయన్మార్ ఉన్నాయి.

మానవ హక్కుల ఉల్లంఘనలపై మాట్లాడండి!

- రిషి సునాక్‌ను కోరిన అమ్నెస్టీ ఇంటర్నేషనల్

లండన్ : భారత్‌లో చోటు చేసుకుంటున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై మాట్లాడాల్సిందిగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌ను కోరింది. భారత్‌లో మైనారిటీ గ్రూపులపై విద్వేష నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ దేశంలో మానవ హక్కుల పరిస్థితులు దయనీయంగా వున్నాయని, వాటిని జి-20 సదస్సులో ప్రస్తావించాల్సిందిగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, సునాక్‌కు విజ్ఞప్తి చేసింది. బిజెపి పాలనలో అక్కడ ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీలపై విద్వేష నేరాలు పెరిగిపోయాయని పేర్కొంది. మణిపూర్‌లో లైంగిక వేధింపులు, హింసలకు సంబంధించి తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘటనలు జరిగిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపింది.

అమ్నెస్టీ ఇంటర్నేషనల్ బ్రిటన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సచా దేశ్‌ముఖ్ మాట్లాడుతూ, జి 20 సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో అక్కడ మానవ హక్కుల రికార్డు గురించి ప్రధాని మోడీతో బహిరంగంగా, నిర్భయంగా మాట్లాడే అవకాశం రిషి సునాక్‌కి వచ్చిందని అన్నారు. భారత్, బ్రిటన్ మధ్య జరగాల్సిన వాణిజ్య చర్చలు ఈ అవకాశాన్ని, అంశాన్ని అణచివేయరాదని అన్నారు.

మోడీ నేతృత్వంలో అధికార యంత్రాంగం జర్నలిస్టులపై, మానవ హక్కుల కార్యకర్తలపై దాడులు, వేధింపులకు పాల్పడుతున్నది. ఎన్‌జిఒ, మీడియా సంస్థల కార్యాలయాలపై దాడులకు దిగుతోంది. పైగా అనేకమంది రాజకీయ, మత పెద్దలు ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ముస్లింలు, ఇతర మైనారిటీలు వివక్షాపూరితమైన చట్టాలకు బలవుతున్నారని అమ్నెస్టీ పేర్కొంది.

దిగజారిన పత్రికా స్వేచ్ఛ

- కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ : దేశంలో పత్రికా స్వేచ్ఛ దిగజారిపోతున్నదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జి-20 సమ్మిట్‌కు అమెరికా మీడియాను మోడీ ప్రభుత్వం అనుమతించలేదని ఆరోపించింది. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ జి-20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు భారత్‌కు తొలిసారి వచ్చారు. అమెరికా జర్నలిస్టులు కూడా బైడెన్‌తో కలిసి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు. కాగా, జి-20 సమ్మిట్ కవరేజ్ కోసం వచ్చిన అమెరికా జర్నలిస్టులు జో బైడెన్, మోడీని ప్రశ్నించాలని భావించారని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అయితే మోడీ ప్రభుత్వం ఇందుకు నిరాకరించినట్లు ఆరోపించింది. ప్రొటోకాల్ నిబంధనలు, సెక్యూరిటీ ఆంక్షల కారణాలతో తమను అనుమతించకపోవడంపై అమెరికా జర్నలిస్టులు అంసతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో ఏడాదికి ఏడాది భారత్ ర్యాంకు పడిపోతున్నదని కాంగ్రెస్ విమర్శించింది. మొత్తం 180 దేశాలకు గానూ ఈ ఏడాది భారత్ 161వ స్థానంలో ఉన్న వ్యంగ్య కార్టూన్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

సమాజ్‌వాదీ పార్టీకి ఏచూరి అభినందనలు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని ఘోషిలో జరిగిన ఉప ఎన్నికలో బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించి ఘన విజయం సాధించిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)కి సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు చేశారు. మతతత్వ సమీకరణలతో ప్రజల్లో చీలికలు తెచ్చేందుకు బిజెపి చేస్తున్న కుట్రలపై సాధించిన గెలుపుగా ఆయన పేర్కొన్నారు. మైనార్టీలను, దళిత, గిరిజన ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకొని 'బుల్డోజర్' రాజకీయాలు చేస్తూ మేధావులను, ప్రజాసంఘాల నేతలను వేధింపులకు గురిచేస్తున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై ప్రజలు సాధించిన ఘన విజయంగా అభివర్ణించారు. ఇందుకు సంబంధించి 'బుల్డోజర్'ను లాక్కెళ్తున్న 'సైకిల్'తో కూడిన కార్టున్‌ను ఆయన తన పోస్టుకు జత చేశారు.

నియంత పాలనను తిరస్కరించిన ప్రజలు : సుప్రియా సూలే

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కారు నియంత పాలనను ప్రజలు తిరస్కరించారని నేషనలిస్ట్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్‌సిపి) వర్కింగ్ ప్రెసిడెంట్, లోక్‌సభ సభ్యులు సుప్రియా సూలే అన్నారు. ఇటీవల ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగు స్థానాలను 'ఇండియా' ఫోరం గెలుచుకోవడంపై ఆమె స్పందించారు. 'ఇండియా' ఫోరం అభ్యర్థులకు ఓటేసి గెలిపించిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు దేశంలో ధరలు, నిరుద్యోగం పెరుగుదలకు వ్యతిరేకంగా ఓటేశారని, బిజెపి నియంతృత్వ పాలనను తిరస్కరించారని వ్యాఖ్యానించారు. అదేవిధంగా మహారాష్ట్రలో కరువు పరిస్థితులు, మరాఠా రిజర్వేషన్‌లపై చర్చించేందుకు తక్షణమే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

పేదరికాన్ని దాచిన మోడీ

- రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ : జి-20 సదస్సుకు హాజరయిన ప్రపంచ నేతలకు మురికివాడలు, వీధి జంతువులు కనిపించకుండా వుండేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాట్లు పడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రస్తుతం విదేశాల్లో వున్న రాహుల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారతదేశ వాస్తవికతను మన అతిథుల కంటపడకుండా దాచిపెట్టాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సదస్సుకు ముందుగా, కొన్ని మురికివాడలను గ్రీన్ షీట్‌లతో కప్పివుంచిన దృశ్యాన్ని, వీధి జంతువుల పట్ల క్రూరంగా వ్యవహరించిన తీరును కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. ఇదే విషయమై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ కూడా ప్రధానిపై ధ్వజమెత్తారు. సదస్సుకు ముందుగానే మురికివాడలను కూల్చడమో లేదా కప్పి వుంచడమో చేశారని, దీంతో వేలాదిమంది పేదలు నిర్వాసితులయ్యారని పేర్కొన్నారు. 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' అన్న థీమ్‌తో జి-20 సదస్సు జరుగుతోందని, కానీ ప్రధాని మోడీకి 'ఒక వ్యక్తి, ఒక ప్రభుత్వం, ఒక బిజినెస్ గ్రూపు' పట్లే నమ్మకం వున్నట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. గౌతమ్ అదానీ గ్రూపు ఆర్థిక లావాదేవీలను కాంగ్రెస్ ప్రశ్నించింది. అవినీతి, మనీ లాండరింగ్ కార్యకలాపాలను అణచివేయాలంటూ మోడీ అంతర్జాతీయ సమాజానికి గతంలో ఇచ్చిన పిలుపులను ఈ సందర్భంగా కాంగ్రెస్ గుర్తు చేసింది.

బిజెపి బి-టీమ్ అని తేలిపోయింది

- జెడిఎస్‌పై సిద్ధరామయ్య

బెంగళూరు : సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, జెడిఎస్ పొత్తుపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఘాటుగా స్పందించారు. జెడిఎస్..బిజెపికి 'బి'టీమ్ అన్న సంగతి దీంతో నిర్ధారణ అయ్యిందని ఆయన చెప్పారు. హుబ్లీ విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మేము వాళ్లను (జెడిఎస్) బిజెపికి బి టీమ్ అన్నప్పుడల్లా మాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఊగిపోయారు. ఇప్పుడు వాళ్లే బిజెపితో పొత్తు అంటున్నారు. పార్టీ పేరులో మాత్రమే 'సెక్యులర్' (లౌకికవాదం) అని వేసుకున్నారే కానీ మతతత్వ బిజెపితో అంటకాగుతూనేవున్నారు' అని సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ మనుగడ కోసం తమ పొత్తులుంటాయని మాజీ ప్రధాని, జెడిఎస్ అగ్రనేత హెచ్‌డి దేవేగౌడ వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ 'అంటే వాళ్లకు ఒక సిద్ధాంత లేదు. నియమం లేదు. అధికారం కోసం ఎవ్వరితోనైనా పొత్తు పెట్టుకుంటారు' అని ఆయన విమర్శించారు.

పొత్తుపై ఎలాంటి చర్చ జరగలేదు : కుమారస్వామి

కాగా బిజెపితో పొత్తుపై ఎలాంటి చర్చలు జరగలేదని మాజీ ముఖ్యమంత్రి, జెడిఎస్ నేత కుమారస్వామి తెలిపారు. బిజెపి నేత, మాజీ సిఎం యడియూరప్ప శుక్రవారం చేసిన వ్యాక్యలు ఆయన వ్యక్తిగతమని తెలిపారు. 'యడ్యూరప్ప వ్యాఖ్యలు పూర్తిగా ఆయన వ్యక్తిగతం. ఇప్పటివరకు బిజెపి-జెడి(ఎస్) మధ్య లోక్‌సభ సీట్ల పంపకంపై గానీ, పొత్తుపై గానీ ఎలాంటి చర్చ జరగలేదు. తాము స్నేహపూర్వకంగా రెండు, మూడు సార్లు కలిశాం. ముమ్ముందు ఏం జరుగుతుందో చూద్దాం. ప్రజల ముందుకు వెళ్లడానికి ముందే తాము కలిసి చర్చించుకోవాల్సిన అవసరం ఉంది' అని కుమారస్వామి అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి-జెడి(ఎస్) కలిసి పోటీ చేస్తాయని, జెడి(ఎస్) నాలుగు లోక్‌సభ స్థానాల్లో, బిజెపి 24 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేలా ఒప్పందం కుదిరిందని, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నేత బిఎస్ యడ్యూరప్ప పేర్కొన్న సంగతి తెలిసిందే.

జి-20లో ఆఫ్రికన్ యూనియన్ చేరిక

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. జి20 శాశ్వత సభ్యదేశాల హోదాలో కేటాయించిన కుర్చీలో ఆసీనులు కావాల్సిందిగా ఆఫ్రికన్ యూనియన్ చైర్ పర్సన్ అజలి అసౌమనిని ఆయన ఆహ్వానించారు. అజలి తన కుర్చీలో ఆసీనులు కాగా శాశ్వత సభ్యదేశాలన్నీ చప్పట్లతో స్వాగతం పలికారు. ప్రధాని మోడీ ఆయనను ఆలింగనం చేసుకున్నారు. జి20లో గ్రూప్‌లో అమెరికా, అర్జెంటినా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, బ్రిటన్, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, తుర్కియే కలిపి 19 దేశాలున్నాయి. యూరోపియన్ యూనియన్ ఈ గ్రూపులో 20వ మెంబర్‌గా ఉంది. ఇప్పుడు ఆఫ్రికన్ యూనియన్ కూడా శాశ్వత సభ్యత్వం పొందడంతో జి20లో 19 దేశాలు, రెండు యూనియన్లు సభ్యులుగా మారాయి. 1999లో జి-20 ఏర్పడిన తర్వాత మొట్టమొదటి విస్తరణ ఇదే. జి-20లో శాశ్వత సభ్యత్వ దేశాల్లో యురోపియన్ యూనియన్ తర్వాత 55 దేశాలతో రెండో అతిపెద్ద గ్రూపుగా ఆఫ్రికన్ యూనియన్ వుంది. భారత్ వ్యాప్తంగా 60కి పైగా నగరాల్లో 200కి పైగా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భారత్‌లో ప్రజా జి-20గా మారిందని మోడీ వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ ఘర్షణపై ఉపయోగించిన పదజాలంపై నేతలందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని అన్నారు. 'ప్రపంచంలోని భిన్న ప్రాంతాల్లో యుద్ధాల వల్ల ప్రజలు అనుభవించే తీవ్రమైన బాధ, ప్రతికూల ప్రభావాలపై ఆందోళన చెందుతున్నాం' అని డిక్లరేషన్ మొదటి వ్యాక్యంలోనే పేర్కొనడం విశేషం. అయితే బాలి శిఖరాగ్ర సదస్సులో 'ఉక్రెయిన్‌పై రష్యా దాడి' వంటి తీవ్రమైన పదజాలాన్ని ఇందులో ఉపయోగించకుండా జాగ్రత్తపడ్డారు. అణ్వాయుధాల వినియోగం ఎంతమాత్రం అనుమతించరానిది అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించలేదు. అంర్జాతీయ చట్టాలు, నియమావళిని అన్ని దేశాలూ పాటించాలి. ఇతర దేశాల సార్వభౌమాధికారం, రాజకీయ స్వతంత్రత, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించాలి. ఇక్కడ ఎలాంటి బలప్రయోగాలకూ దిగకూడదు' అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

వాతావరణ మార్పులపై విభేదాలు

ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సు తరహాలో జి20 సదస్సుల్లో సాధారణంగా అభివృద్ధి చెందిన, వర్తమాన దేశాల మధ్య విభేదాలు కనిపించవు. కానీ ఈ దఫా శిఖరాగ్ర సదస్సులో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకోవడం, పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను పెంచడం, హరిత వాయు ఉద్గారాల కట్టడి వంటి అంశాలపై విభేదాలు పొడచూపాయి. జి20 దేశాలు ప్రపంచ కర్బన ఉద్గారాల్లో 75 శాతానికి కారణం అన్న సంగతి తెలిసిందే. అయితే 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచాలనే అభివృద్ధి చెందిన దేశాల వాదనకు రష్యా, చైనా, సౌదీ అరేబియా, భారత్ తీవ్ర అభ్యంతరాలు తెలియజేశాయి.

రెండు రోజుల్లో 15కి పైగా ద్వైపాక్షిక సమావేశాల్లో మోడీ పాల్గొంటున్నారు. శుక్రవారం అమెరికా అధ్యక్షులు బైడెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సదస్సుకు హాజరైన నేతల్లో జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్స్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయీప్ ఎర్డోగన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్, బ్రెజిల్ అధ్యక్షులు లూయిస్ డసిల్వా వున్నారు. చైనా అధ్యక్షులు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ సదస్సుకు హాజరుకాలేదు.

మోడీ ఎదుట 'భారత్' కార్డు

జి20 శిఖరాగ్ర సదస్సులో అధ్యక్ష స్థానంలో కూర్చున్న ప్రధాని మోడీ ఎదుట 'ఇండియా' బదులుగా 'భారత్' అని రాసివున్న కార్డు కనిపించింది. ఇప్పటికే జి-20 విందు ఆహ్వాన పత్రాలపై ఇండియా స్థానంలో భారత్ అని ముద్రించడంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జి20 మొత్తంగానే 'ఇండియా' స్థానంలో 'భారత్' అనే పదాన్ని జొప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ దస్సులో 'భారత్' తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నది ప్రధాని నరేంద్ర మోడీ అని కూడా పేర్కొంది.

ఉత్తర కొరియా మిలటరీ పరేడ్‌లో రష్యా, చైనా

ప్యాంగాంగ్ : ఉత్తర కొరియా 75వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం రాజధాని ప్యాంగాంగ్‌లో పేరా మిలటరీ పరేడ్ నిర్వహించారు. ట్రక్కులు, ట్రాక్టర్లలో మోసుకువచ్చిన రాకెట్ లాంచర్లను ప్రదర్శించారు. ఈ పరేడ్‌కి రష్యా కళాకారులను, చైనా ప్రతినిధులను ఉత్తరకొరియా ఆహ్వానించింది. చైనా ఉప ప్రధాని లియూ గుయోఝుంగ్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందాన్ని పంపగా, రష్యా, ఒక మిలటరీ గీతాన్ని, నృత్య బృందాన్ని పంపింది. శుభాకాంక్షలు పంపుతూ పుతిన్, జిన్‌పింగ్‌ల నుండి వచ్చిన లేఖలను కిమ్ అందుకున్నారని ప్రభుత్వ మీడియా కెసిఎన్ఎ తెలిపింది. ఉత్తర కొరియాతో తమ దేశాల సంబంధాలను బలోపేతం చేసుకుంటామని ఇరువురు నేతలు ఆ లేఖల్లో పేర్కొన్నారు. తద్వారా ఈ ప్రాంత శాంతి సుస్థిరతలకు దోహదపడతామని తెలిపారు.

విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ భావాలు పెంపొందించాలి

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రాలను అధికారికంగా బోధిస్తూ వాటిలో మాస్టర్ డిగ్రీ ప్రదానం చేయడం ద్వారా ప్రభుత్వమే అశాస్త్రీయ ధోరణులను ప్రజల్లో చొప్పించడానికి ప్రయత్నిస్తోందన్నారు. మన నిత్య జీవనంలో సైన్స్ చాలా అవసరమని, ఇందుకు అనుగుణంగా మన విద్యావిధానంలో మార్పులు రావాల్సి ఉందని తెలిపారు. కార్పొరేట్ విద్యావిధానం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఆత్యహత్యలకు కారణాలను శాస్త్రీయంగా గుర్తించకుండా వసతి గృహాల్లో స్ప్రింగ్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జనంలో విజ్ఞానాన్ని పెంపొందింపజేసేందుకు జెవివి చేస్తున్న కృషిని అభినందించారు. దీన్ని మరింత పెంచాలని సూచించారు. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ సహాయ కార్యదర్శి విజి గోపినాథన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చిల్డ్రన్ సైన్స్ ఫెస్టివల్స్ నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఆధునిక విజ్ఞానాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. చెకుముఖి ద్వారా విద్యార్థులు సైన్స్ పరంగా విజ్ఞానాన్ని పొందుతున్నారని వివరించారు. తాము కేరళలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించే కార్యక్రమాలు కూడా చేస్తున్నామన్నారు. చెత్త నుంచి పునరుత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ప్రొఫెసర్ రామచంద్రయ్య, జెవివి నేతలు గోపాలన్ శివన్నారాయణ, తెలంగాణ రాష్ట్ర జెవివి అధ్యక్ష, కార్యదర్శులు కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్, జెవివి ఎపి ప్రధాన కార్యదర్శి మురళీధర్, కుర్రా రామారావు తదితరులు ప్రసంగించారు. జెవివి ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు స్వాగతోపన్యాసం చేశారు. జెవివి నేత రాజశేఖర్ రాహుల్ అధ్యక్షత వహించారు.



మీకోసం

కొద్దిగా నిమ్మరసం, గుడ్డులోని తెల్లసొన కలిపి, తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు బాగా పెరగడమే కాకుండా, ఎంతో మృదువుగా ఉంటుంది.

జీవన సౌరభం

సక్సెస్ స్టోరీల్లో మెసేజ్‌లు మాత్రమే ఉంటాయి. ఫెయిల్యూర్ స్టోరీల్లో విజయానికి కావాల్సిన ఐడియాలు దొరుకుతాయి.

తెలుగు భాష

'తాతయ్య! నాకు తెలుగు భాష గురించి వ్యాసం రాసి ఇవ్వాలి. మా పాఠశాలలో భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. రేపు 'తెలుగు భాష ... వెలుగు భాష' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు' అని 7వ తరగతి చదువుతున్న చరణ్ తన తాతయ్య రామంని అడిగాడు.

అప్పుడు 'ఒరేయ్ చరణ్.. నేను రాసి ఇస్తే, నువ్వు నేర్చుకునేదేంటి? నువ్వే సొంతంగా రాయాలి' అని తాతయ్య అన్నారు. 'నాకేం తెలుసు తాతయ్య! తెలుగు గురించి!' అన్నాడు చరణ్.

"నువ్వు పుట్టినప్పటి నుంచి ప్రతిరోజూ తెలుగు మాట్లాడుతున్నావు, తెలుగు వింటున్నావు, మీ పాఠశాలలో తెలుగు పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్నావు. నీకు మన తెలుగు భాష ఏమనిపిస్తుందో అదే వ్యాసంగా రాయి." అని తాతయ్య ఇచ్చిన సలహా చరణ్‌కి బాగా నచ్చింది.

ఆలస్యం చేయకుండా తనకు తెలిసిన తెలుగు భాష గురించి వ్యాసం రాశాడు. తర్వాత రోజు వ్యాసరచన పోటీలో పాల్గొన్నాడు. 'మన మాతృభాష తెలుగు మాధుర్యం చందమామ వెన్నెల చల్లదనం, అమ్మ ప్రేమ వలే అమృతం. ఎటువంటి విషయమైనా మాతృభాషలో నేర్చుకుంటే మనసుకు హత్తుకుంటుంది. మన జీవనానికి వెలుగు నింపే దిశగా మాతృభాష నడుపుతుంది' అని చరణ్ రాసిన వ్యాసాన్ని స్కూలు ప్రిన్సిపాల్ పిల్లలందరి ముందూ చదివారు.

తెలుగు భాషోత్సవం నాడు వ్యాసరచన పోటీలో చరణ్‌కి ప్రథమ బహుమతి ఇచ్చారు. సొంతంగా తన ఆలోచనతో రాసిన వ్యాసానికి బహుమతి రావడంతో చరణ్ చాలా ఆనందించాడు.

- మొర్రి గోపి
88978 82202

తమాషా చూడండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన తెలుగు పదాలకు ఎదురుగా ఉన్న బాక్సుల్లో ఇంగ్లీషు అర్థాలు రాయండి. ఆ పదం చివరి అక్షరంతో మొదలవుతూ పక్కనే ఉన్న తెలుగు పదం వస్తుంది. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం. మిగిలినవి మీరు రాయండి. ఈ తమాషాను ట్రై చేయండి.

మంచం	C	O	T	A	P		నల్లా
పిల్లి			T				పొడుగు
కొవ్వు			T				పనిముట్టు
ఎలుక			T				మాట్లాడు
చాప			T				కాలం

నేను గీసిన బొమ్మ

- బడే తరుణ్,
8వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ముత్యాల పేట
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మహిళల ఆరోగ్యానికి ఆయుర్వేదం

సాధారణంగా పురుషులతో పోలిస్తే ఆడవారిలో ఎక్కువగా అనారోగ్య సమస్యలు కన్పిస్తుంటాయి. హార్మోన్లలో మార్పులు, పీరియడ్స్, ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు ఏదో ఒక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం దాదాపు 40 శాతం మంది గర్భిణీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఏటేటా గర్భాశయ క్యాన్సర్ కారణంగా లక్షలాది మంది మహిళలు మరణిస్తున్నారు. గర్భధారణ, డెలివరీ సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ కనీసం 810 మంది మహిళలు చనిపోవడం ఆందోళన కలిగించే విషయం. గుండె సమస్యలు, అధిక బరువు, బ్రెస్ట్ క్యాన్సర్, హైబీపీ, విటమిన్ డి లోపం, మూత్రాన్ని ఆపుకోలేకపోవడం, ఆస్టియో పోరోసిస్, డయాబెటిస్ వంటి అనారోగ్య సమస్యలను మహిళలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో పరిష్కార పద్ధతులు, మందులు ఉన్నాయి. సహజ సిద్ధమైన పద్ధతుల్లోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వటానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి.

మహిళల్లో 48 నుంచి 55 సంవత్సరాల మధ్యలో నెలసరి ఆగిపోతుంది. ఈస్ట్రోజెన్ హార్మోన్ అప్పటివరకూ కాల్షియం నిల్వలను నిర్వహిస్తుంటుంది. నెలసరి ఆగిపోయిన తర్వాత మహిళలకు కాల్షియం అవసరం కనుక, ఈ క్రమంలో ఎముకలు గుల్లబారడం, విరిగిపోతుండటం (ఆస్ట్రోపీనియా లేదా ఆస్టియో పోసిస్) వంటివి జరుగుతుంటాయి. తరచుగా కాళ్లు చేతుల నొప్పులు ప్రారంభమవుతాయి. మాంసకృత్తులు (ప్రొటీన్), రక్తం శాతం (హిమోగ్లోబిన్) తగ్గుతుంటుంది. లావుగా మారటం లేదా సన్నగా మారటం జరుగుతుంది. ఇలాంటి వాటికి తరచుగా మునగాకు కూరగా వండుకుని తింటే కాల్షియం పెరుగుతుంది. నల్లేరును కూడా ఉపయోగించ వచ్చు. దగ్గు, శ్లేషము తగ్గటానికి నల్లేరును రొట్టె, తేనే, వడియాల్లో కలిపి వాడితే తగ్గుముఖం పడుతుంది. ప్రతి ఒక్కరూ ఎక్కువగా మంచినీరు తాగుతూ ఉండాలి. 40 సంవత్సరాలు దాటిన తర్వాత షుగర్, బిపి, ఎక్కువగా బరువు పెరగటం వంటివి వస్తూ ఉంటాయి. వీటికి రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవటం మంచిది.

పిసిఒడి లక్షణాలు, చికిత్స : పాలిసిస్టిక్ అండాశయ రుగ్మత (పీసీఓడీ) వల్ల అండాశయాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల వస్తుంది. అండం విడుదల లోపించడం లేదా అరుదుగా జరగడం, పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం వంటివి తెలుస్తాయి. అండాశయం పెద్దగా ఉండటం, అండాల చుట్టూ ఫోలికల్స్ ఉండటం (పాలిసిస్టిక్ అండాశయాలు) మరో కారణంగా చెప్పవచ్చు.

పీసీఓడీ లక్షణాలు సాధారణంగా రుతుస్రావం అయ్యే మహిళల్లో స్పష్టంగా కన్పిస్తాయి. దీనిలో పీరియడ్స్ సరిగా రాకపోవటం, పూర్తిగా రాకపోవటం ఉంటాయి.

- పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం లేదా పూర్తిగా రాకపోవడం
- ముఖం, ఛాతీ, వెన్ను లేదా పిరుదులపై అధికంగా జుట్టు పెరగడం
- తల వెంట్రుకలు సన్నబడటం లేదా కోల్పోవడం
- చర్మం జిడ్డుగా ఉండటం, మొటిమలు
- మెడ, చేతులు, రొమ్ములు, తొడలపై ముదురు లేదా గట్టిగా ఉండే చర్మం
- బరువు పెరగడం
- ఆందోళన, డిప్రెషన్

నెలసరి సమస్యలు ప్రారంభం కావటం ద్వారా అనేక సమస్యలు కూడా వస్తాయి. ఇలా మోనోపాజ్ స్థాయి వరకూ ఈ సమస్యలు ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంటాయి. విదేశాల్లో ఏటేటా బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్ట్ చేయిస్తారు. ఏమైనా ప్రమాదకర కణుతులు ఏర్పడుతున్నాయా అని పరిశీలించటానికి ఈ టెస్టు చేయిస్తారు. మనదేశంలో ఇలా పరక్షలు చేయించుకోవాలన్న అవగాహన తక్కువగా ఉంది. సొంతంగా కూడా రొమ్ము పరీక్షలు చేసుకోవొచ్చు. వారంలో ఒకసారి అద్దం ముందు నిలబడి స్తనాలను చూసుకోవాలి. లోపల గట్టిగా ఉంటే గెడ్డలు వంటివి వచ్చే ప్రమాదం ఉంటుంది. సహజ పరిణామంలో మార్పు ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

రక్తహీనతా ప్రమాదకరమే : రక్తహీనత ఉంటే అధిక రుతు రక్తస్రావం, నెలసరి రాకపోవటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తలనొప్పి, తల తిరగడం, జుట్టు ఊడిపోవటం, చర్మం పొడిబారడం, దడ వంటివి వస్తాయి. ఎర్ర రక్త కణాలను తయారు చేయడానికి శరీరానికి ఇనుము అవసరం. ఇది కణాలను శరీరం అంతటా ఆక్సిజన్‌ను తీసుకువెళ్లేలా చేస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ లేనప్పుడు, కణజాలం, కండరాలు సమర్థవంతంగా పనిచేయడానికి తగినంత ఆక్సిజన్‌ను అందుకోలేవు. రక్తహీనతకు సకాలంలో చికిత్స చేయకపోతే గుండె సంబంధిత వ్యాధులకు సైతం దారితీయొచ్చు.

కొన్ని సమస్యలు - చిట్కాలు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కలుషిత నీరు తాగితే జలుబు, దగ్గు, నిమ్ము చేయడం, ఉబ్బసం వచ్చే అవకాశం ఉంది.

- పావు స్పూను దాల్చిన చెక్కపొడి, స్పూను తులసి ఆకు రసం, చిటికెడు మిరియాల పొడిని తేనెతో కలిపి రోజుకు రెండు సార్లు లేదా అరస్పూను కరక్కాయ, తానికాయ చూర్ణం, చిటికెడు మిరియాల పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి తీసుకోవడం ద్వారా తగ్గుతుంది.
- కామెర్లు, వాంతులు, విరేచనాలు, బంక విరేచనాలు, కడుపునొప్పి వంటి రోగాల నివారణకు చేదుగా ఉండే కాకర, మెంతులు, పసుపు వంటివి నిత్యం తీసుకునే ఆహారంలో తరచుగా ఉండేలా చూసుకోవాలి.
- దోమలు కుడితే విషజ్వరాలు ప్రబలుతాయి. వేపాకులు, కర్పూరం, నేలవేములను ఎండబెట్టి ప్రతిరోజూ ధూపం వేస్తే దోమల వ్యాప్తిని అరికట్టొచ్చు.
- ఊపిరితిత్తుల సమస్యలు ఉంటే అవి తీవ్రమైన సమస్యలు కాకపోతేనే శొంఠి, ధనియాలు, సోంపు, జీలకర్ర నీటిలో వేసుకొని వేడి చేసి 100 మిల్లీలీటర్ల చొప్పున రోజుకు రెండు సార్లు తాగాలి. అగస్త్య హరీతకీ రసాయనం, చ్యవన ప్రాశ లేహ్యం వంటివి పాలతో తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది.
- తామర, సోబి నివారణకు గానుగ ఆకులు, వేపాకు బెరడు, మార్కుండి ఆకు, కసింతాకులను మెత్తగా నూరి పసుపు కలిపి రాస్తే తగ్గుతాయి.
- కాళ్ల పాస్తే స్వేత మల్హం, సింధూరాది లేపం రాసుకోవాలి.
- పిసిఒడి సమస్య ఉన్నవారు శెనగలు తినాలి.
- ప్రతిరోజూ గంటపాటూ నడవాలి
- మహిళలు ఎండకూ, వానకూ బయటకు వచ్చేటప్పుడు ఖచ్చితంగా గొడుగు వాడాలి
- అందుబాటులో మంచినీటి బాటిల్ ఉంచుకోవాలి
- ప్రయాణాల్లో స్నాక్స్, బిస్కెట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.

-ప్రొఫెసర్ డాక్టర్ కోలా విజయకుమారి
ఎండి, ఆయుర్వేద
ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ప్రసూతి విభాగం అధిపతి,
విజయవాడ.
సెల్ : 94901 06269

అడుగడుగునా అడ్డగింత

- టిడిపి కార్యకర్తలపై విరుచుకుపడ్డ పోలీసులు
- జాతీయ రహదారి పొడవునా లాఠీఛార్జి
- రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తల అరెస్టు

పోలీసులు పలుచోట్ల అడ్డుకోవడంతో జగ్గయ్యపేట వద్ద రహదారిపై పడుకొని నిరసన తెలుపుతున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- యంత్రాంగం

నంద్యాలలో శనివారం ఉదయం అరెస్టు చేసిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడును సాయంత్రం 5.10 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సిట్ కార్యాలయానికి సిఐడి అధికారులు కారులో తరలించారు. ప్రకాశం జిల్లా సరిహద్దు నుంచి తాడేపల్లి కార్యాలాయానికి తరలించడానికి దాదాపు మూడు గంటలకుపైగా సమయం పట్టింది. చిలకలూరిపేట నుంచి తాడేపల్లి వరకు దాదాపు పది చోట్ల చంద్రబాబు కాన్వాయ్‌ను కార్యకర్తలు అడ్డుకోగా పోలీసులు లాఠీఛార్జి చేశారు. చిలకలూరిపేటలో జరిగిన లాఠీఛార్జిలో పలువురు మీడియా ప్రతినిధులు గాయపడ్డారు. చంద్రబాబును తరలిస్తున్న వాహనాన్ని ఒంగోలు, అద్దంకి నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. జేపంగులూరు మండలం ముప్పవరం వద్ద విచక్షణారహితంగా లాఠీలు ఝుళిపించారు. ఇక్కడ పది నిమిషాలుపై గానే కాన్వాయ్ నిలిచిపోయింది. చిలకలూరి పేట నుంచి తాడేపల్లి వరకు 80 కిలోమీటర్లు ఉండగా దాదాపు పది చోట్ల చంద్రబాబు కు మద్దతుగా ఆయన కాన్వాయ్‌ను అడ్డుకోగా పోలీసులు ఆయా చోట్ల లాఠీఛార్జీ చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లా ఎస్‌పిలు రవిశంకరరెడ్డి, ఆరీఫ్ హాఫీజ్ స్వయంగా పాల్గొని చంద్రబాబు కాన్వాయ్‌ను ముందుకు పోనివ్వడానికి తీవ్రంగా ప్రయత్నించారు. మధ్యా హ్నం రెండు గంటల ప్రాంతంలో చిలకలూరిపేట ఎన్ఆర్‌టి సెంటర్‌లో వేలాది మంది టిడిపి కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో, చంద్రబాబు కాన్వాయ్ దాదాపు 30 నిమిషాలు నిలిచి పోయింది. పోలీసులు లాఠీఛార్జీ చేసినా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రోడ్డుపై బైఠా యించడంతో చివరికి చంద్రబాబు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు ఫోన్ చేసి కార్యకర్తలకు సర్దిచెప్పమని కోరారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని, కాన్వాయ్‌ను ముందుకు వెళ్లనివ్వండని చంద్రబాబు కోరగా చివరికి కార్యకర్తలు శాంతించడంతో కాన్వాయ్ ముందుకు వెళ్లింది. చిలకలూరిపేటలో జరిగిన లాఠీఛార్జీలో పలువురు మీడియా ప్రతినిధు లు కూడా గాయపడ్డారు. తిమ్మాపురం, యడ్లపాడు వద్ద కూడా కాన్వాయ్‌ను టిడిపి శ్రేణులు అడ్డుకు న్నాయి. ఆ తర్వాత గుంటూరు మిర్చి యార్డు, బుడంపాడు బైపాస్, తక్కెళ్లపాడు, ఆటో నగర్, మంగళగిరి-తెనాలి మార్గం వద్ద ఫ్లైఓవర్ వద్ద, జనసేన కార్యాలయం వద్ద, తాడేపల్లి మండలం కొలనుకొండ, కుంచనపల్లి తదితర ప్రాంతాల్లో కాన్వాయ్‌ను టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. పలుచోట్ల జరిగిన లాఠీఛార్జీ, పోలీసుల దాడిలో టిడిపి కార్యకర్తలు పలువురు గాయపడ్డారు. తక్కెళ్లపాడు వద్ద టిడిపి నాయకులు కంభంపాటి శిరీష్, తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ గాయపడిన వారిలో ఉన్నారు.

రోడ్డుపై పవన్ కల్యాణ్ నిరసన

పవన్ కల్యాణ్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో కోదాడ వైపు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అనుమంచిపల్లి వద్ద మరోసారి అడ్డుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పవన్‌కల్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్‌ను కూడా అదుపులోకి తీసుకొని అక్కడనుండి తరలించారు.

లండన్‌లో ఎన్ఆర్ఐల నిరసన

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస చేసిన ప్రాంతంలో ఎన్ఆర్ఐలు నిరసన తెలిపారు.

లండన్‌లో నిరసన తెలుపుతున్న ఎన్ఆర్ఐలు

పోలీసుల వలయంలో విజయవాడ కోర్టు పరిసరాలు

స్పెషల్ జడ్జి ఇంటి వద్ద చంద్రబాబును హాజరుపరిచే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం రాత్రి 10:30 నిమిషాల వరకు కోర్టుకు సిట్ అధికారులు హాజరుపరచలేదు. కోర్టు సమయం ముగిసిన నేపథ్యంలో అర్ధరాత్రి దాటిన తర్వాత స్పెషల్ ఎసిబి కోర్టు జడ్జి హిమబిందు నివాసం వద్ద చంద్రబాబును హాజరుపరచవచ్చని తెలిసింది. చంద్రబాబు తరపున కోర్టులో వాదించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను నియమించారు. ఆయనకు సహాయకారిగా లీగల్ కౌన్సిల్ కింద దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మీనారాయణ, జవ్వాది శరత్ చంద్రను పార్టీ నిర్ణయించింది. ఇదే విషయాన్ని సిట్ ఇన్వెస్టిగేషన్ అధికారికి చంద్రబాబు తెలిపారు. చంద్రబాబును కోర్టుకు తీసుకొచ్చే సమయంలో ఎటువంటి శాంతి భద్రతలు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ భారీ బందోబస్తును కోర్టు ప్రాంగణంలోకి వెళ్లే రహదారుల వద్ద నియమించింది. కోర్టు పరిసర ప్రాంతాలన్నీ పోలీసులతో నిండిపోయాయి.

బాబు అరెస్టుపై మనస్తాపంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/ తుగ్గలి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు వార్తతో ఇద్దరు కార్యకర్తలు మరణించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ(43) టిడిపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన భార్య హైమావతి 2014-19 వరకు తంగేళ్లపాలెం ఎంపిటిసి సభ్యులుగా పనిచేశారు. ఈ నేపథ్యంలో నంద్యాలలో చంద్రబాబు అరెస్టు వార్తతో వెంకటరమణ గుండెపోటుకు గురయ్యాడు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు.

వెంకటరమణ

రామావత్ లక్ష్మి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఉప్పర్లపల్లికి చెందిన రామావత్ లక్ష్మి (58) తెలుగుదేశంపార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తున్నారు. టిడిపి తరుపున ఉప్పర్లపల్లి ఎంపిటిసి సభ్యురాలిగా పని చేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టివి చూస్తూ గుండెపోటుతో మృతి చెందారు. లక్ష్మికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టీమిండియాకు కఠిన పరీక్ష

- సూపర్-4లో నేడు పాకిస్తాన్‌తో కీలక పోరు
- పొంచివున్న వర్షం ముప్పు?
- మధ్యాహ్నం 3.00గం॥ల నుంచి

కొలంబో: ఆసియాకప్ క్రికెట్ టోర్నీ సూపర్-4లో భారతజట్టు కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా.. పాకిస్తాన్‌తో తల పడనుంది. ఇరుజట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా తుడుచుకు పోవడంతో ఇరుదేశాల క్రీడాభిమానులు ఈ మ్యాచ్ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇక టీమిండియా విషయానికొస్తే.. లీగ్ దశలో పాకిస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారతజట్టు 266పరుగులకే ఆలౌటైంది. ఇషాన్, హార్దిక్ పాండ్యా మినహా.. మిగతా బ్యాటర్స్ నిరాశపరిచారు. ఆ తర్వాత వర్షం కారణంగా మ్యాచ్ సజావుగా సాగకపోయినా.. పాక్ పేసర్లు భారత్‌పై పైచేయి సాధించారు. ఈ క్రమంలో భారతజట్టు ఫైనల్‌కు చేరాలంటే తొలి అడ్డంకి అయిన పాకిస్తాన్‌పై గెలుపు తప్పనిసరి. కేఎల్ రాహుల్, జస్ప్రీత్ బుమ్రా కూడా జట్టుకు అందుబాటులోకి రావడంతో ఓపెనింగ్ జోడీగా ఎవరెవరు బరిలోకి దిగుతారో మరికొంత సేపట్లో తేలిపోనుంది.

ఈ క్రమంలో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భారత్‌పై కచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. "మేము గత రెండు నెలల నుంచి శ్రీలంకలో క్రికెట్ ఆడుతున్నాము. మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు లంక ప్రిమియర్ లీగ్‌లో ఆడారు. అలాగే టోర్నీ ప్రారంభానికి ముందు ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్ కూడా ఆడాం. కాబట్టి లంక పరిస్థితులను బాగా అర్థం చేసుకున్నా మన్నాడు. ఆ అనుభవంతో భారత జట్టుపై పైచేయి సాధిస్తామని, లీగ్ దశ మ్యాచ్‌లోనూ భారత్‌పై పై చేయి సాధించామని పేర్కొన్నాడు. అలాగే పాక్ పేస్ త్రయం షహీన్ షా అఫ్రిది, హారీస్ రవూఫ్, నసీం షాపై బాబర్ ప్రశంసల వర్షం కురిపించాడు.

భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కూ వర్షం ముప్పు?

భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే ఆసియా కప్ సూపర్-4 మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఇరుజట్ల మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ అవకాశాలు లేవని అక్కడ వాతావరణ శాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కొలంబోలో 90 శాతం వర్షం కురిసే అవకాశమున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. ముఖ్యంగా సాయంత్రం వేళలో వర్షం కురిసే అవకాశం ఎక్కువగా ఉందని, రిజర్వ్ డే అయిన మరుసటి రోజు కూడా ఇదే పరిస్థితి ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదని తెలిపింది. ఇక భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన తొలి లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే.

జట్లు(అంచనా)...

భారత్ : రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్/కేఎల్ రాహుల్, కోహ్లి, శ్రేయస్, ఇషాన్(వికెట్ కీపర్), హార్దిక్, జడేజా, బుమ్రా, సిరాజ్, కుల్దీప్, శార్దూల్.

పాకిస్తాన్ : బాబర్(కెప్టెన్), రిజ్వాన్(వికెట్ కీపర్), ఇమామ్-ఉల్-హక్, అఘా సల్మాన్, ఇఫ్తికార్ అహ్మద్, షాదాబ్ ఖాన్, షాహీన్ షా, నసీమ్ షా, రవూఫ్, నవాజ్, అష్రాఫ్/హారీస్.

రికార్డు గ్రాండ్‌స్లామ్‌పై జకోవిచ్ గురి

యుఎస్ ఓపెన్ ఫైనల్లో మెద్వదేవ్‌తో ఢీ • సెమీస్‌లో టాప్‌సీడ్ అల్కరాజ్ ఓటమి



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, 3వ సీడ్, రష్యాకు చెందిన డానియెల్ మెద్వదేవ్ ప్రవేశించారు. శనివారం జరిగిన తొలి సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్, టాప్‌సీడ్ అల్కరాజ్ జోరుకు మెద్వదేవ్ చెక్ పెట్టాడు. హోరాహోరీగా సాగిన సెమీస్‌లో మెద్వదేవ్ 7-6(7-3), 6-1, 3-6, 6-3తో అల్కరాజ్‌ను ఓడించాడు. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో చేజిక్కించుకున్న మెద్వదేవ్.. రెండో సెట్‌ను సునాయాసంగా నెగ్గాడు. మూడో సెట్‌ను కోల్పోయినా.. నాల్గోసెట్‌లో తిరిగి పుంజుకొని మ్యాచ్‌ను ముగించాడు. 2021లో మెద్వదేవ్, 2022లో అల్కరాజ్ యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సాధించారు.

జకోవిచ్ జోరు..

సెర్బియాకు చెందిన 2వ సీడ్, నొవాక్ జకోవిచ్ రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. శనివారం జరిగిన రెండో సెమీస్‌లో జకోవిచ్ 6-3, 6-2, 7-6(7-4)తో అన్‌సీడెడ్, అమెరికాకు చెందిన షెల్టన్‌ను ఓడించాడు. దీంతో కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు చేరువయ్యాడు. అత్యధిక పురుషుల సింగిల్స్ టైటిల్‌ను నెగ్గిన ఆటగాళ్ల జాబితాలో జకోవిచ్(23) ఇప్పటికే అగ్రస్థానంలో ఉండగా.. మరో టైటిల్ నెగ్గితే మార్గరేట్ కోర్ట్(24గ్రాండ్‌స్లామ్స్) రికార్డును సమం చేయనున్నాడు. ఆ తర్వాత రఫెల్ నాదల్(22), రోజర్ ఫెదరర్(20) 2, 3 స్థానాల్లో ఉన్నారు. ఆదివారం రాత్రి జరిగే ఫైనల్లో టైటిల్‌కై మెద్వదేవ్‌తో తలపడనున్నాడు.

మెరిసిన నెయ్‌మార్

- పీలే రికార్డు బ్రేక్
- బొలీవియాపై 5-1తో గెలుపు

బ్రస్సిలియా(బ్రెజిల్): ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ జూనియర్ అరుదైన ఘనత సాధించాడు. బొలీవియాతో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ జట్టు 5-1గోల్స్ తేడాతో ఘన విజయంసాధించింది. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ 61వ, 93వ ని.లో రెండు గోల్స్ కొట్టి బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం పీలే రికార్డు బ్రేక్ చేశాడు. పీలే అంతర్జాతీయ పోటీల్లో 77 గోల్స్ చేయగా.. నెయ్‌మార్ 79 గోల్స్‌తో ప్రథమస్థానంలో నిలిచాడు. రెండో రౌండ్‌లో బ్రెజిల్ జట్టు పెరూతో తలపడనుంది. నెయ్‌మార్ ఇటీవల సౌదీ అరేబియాకు చెందిన అల్ హిలాల్ క్లబ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68